www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ | 14.04.2024 | సంపుటి:2 సంచిక: 183

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

## గిరిజనుల హక్కులపై బీజేపీ దాడి



- ఆదివాసీ పదం అర్థాన్ని మారుస్తున్నారు
- కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజం
- చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో పర్యటన

వివరాలు 2లో



వివరాలు 2లో

## కాంగ్రెస్ వైపు గల్ఫ్ కార్మికుల కుటుంబాలు

- ఎన్నారై విభాగం బృందం ప్రత్యేక ప్రచార కార్యాచరణ
- పార్లమెంటు ఎన్నికలపై కాంగ్రెస్ ఎన్నారై విభాగం సమీక్ష



## గుడ్డిగా ఓటువేస్తే ఇబ్బందులు తప్పవు

- నోరు మూసుకుని కూర్చోను
- ప్రజలకు మంచి జరగడం కోసం పోరాటం చేస్తా
- ప్రభుత్వ వాగ్దానాలు నెరవేరాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాల్సిందే..
- మతపిచ్చిలో పడితే మన అవసరాలు తీరవు..
- బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ వ్యాఖ్యలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం.. తెలంగాణ ప్రయోజనాల కోసమని కేసీఆర్ అన్నారు. ఉద్యమంలో మీ దీవెనతో విజృంభించి పోరాడి తెలంగాణను సాధించామన్నారు. మీరు అధికారం ఇస్తే పదేండ్లు అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నామని.. అనేక మందిని కాపాడుకున్నామని చెప్పారు. ఇవాళ అవన్నీ తన కండ్ల ముందే పోతుంటే.. రైతులు గోస పడుతుంటే.. పంటలు కొనకపోతుంటే.. బోనస్ దక్కకపోతుంటే చూసి బాధగలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బతికి ఉన్నన్ని రోజులు తెలంగాణ ప్రజలకు మంచి జరగడం కోసం పోరాటం చేస్తా తప్ప నోరు మూసుకుని కూర్చోనని స్పష్టం చేశారు. వందకు వంద శాతం బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం.. ప్రజల ప్రయోజనాల కోసం ఉంటుందని తెలిపారు. అన్ని రకాల ప్రజల హక్కులు కాపాడేందుకు మీ వెంటే ఉంటదని స్పష్టం చేశారు.చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

బీఆర్ఎస్ పార్టీల రంజిత్ రెడ్డికి ఏం తక్కువ చేసినం అని కేసీఆర్ అన్నారు. ఎంపీ టికెట్ ఇవ్వలేదా? గౌరవం ఇవ్వలేదా? ఆయనెందుకు పార్టీ మారిండు అని ప్రశ్నించారు. ఆయన ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా? అధికారం ఎటుంటే అటు తిరుగుతడా? అని సెటైర్ వేశారు. ఆయన ఎందుకు కాంగ్రెస్‌లోకి వెళ్లిండు.. అధికారం కోసమా? పదవుల కోసమా? పైరవీల కోసమా? సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇలాంటి వ్యక్తులకు ధీటైన దెబ్బ కొట్టాలని ప్రజలకు సూచించారు. ఇప్పుడు ప్రజల చేతిలోకి ఒక అంకుశం కావాలని.. ఒక హంటర్ కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మెడలు వంచి పనిచేయించే అంకుశం అవసరం ఇప్పుడు ఉందని పేర్కొన్నారు.అలాంటి అంకుశంలో ఓ పదునైన మొనదేలినటువంటి అంకుశం చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అని ఆయన పేర్కొన్నారు. ఆయన అనుభవం ఉన్న వ్యక్తి, బలహీనవర్గాల వ్యక్తి అని అన్నారు. చేవెళ్లలో శనివారం నిర్వహించిన ప్రజాశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం మెడలు వంచి మీ పనులు చేయించాలంటే తెలంగాణలోని అన్ని ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

### బలమైన ప్రతిపక్షం ఉండాల్సిందే..

ఈ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేరాలంటే.. బలమైన ప్రతిపక్షం ఉండాలని

### బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి.. ?

గుడ్డిగా ఓటు వేయొద్దు. చాలా ఇబ్బందులు వస్తాయి. బీజేపీ చరిత్ర మీరు చూడలేదా..? ఒక్క మాట ఆలోచించాలి. ఈ బీజేపీ ప్రభుత్వం గత పదేండ్లలో దేశ వ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేసింది. మెడికల్ కాలేజీలు తెలంగాణకు మంజూరు చేయాలని నేను 100 ఉత్తరాలు రాశాను. ఒక్క కాలేజీ ఇవ్వలేదు. అలాంటి బీజేపీకి ఒక్క ఓటు ఎందుకు వేయాలి. కేంద్రంలో ఉన్న చట్టం ప్రకారం ఒక రాష్ట్రంలో ఎన్ని జిల్లాలు ఉంటే అన్ని జిల్లాలకు ఒకటి చొప్పున నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలి. అలా మనకు 23 కొత్త నవోదయ పాఠశాలలు రావాలి. వీటి కోసం వంద యాభై ఉత్తరాలు రాశాను. స్వయంగా అడిగాను. కానీ ఇవ్వలేదు. చట్టాన్ని ఉల్లంఘించిన బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి..? దేని కోసం ఓటు వేయాలి..? అని కేసీఆర్ ప్రశ్నించారు.



## ఏపీ సీఎం జగన్‌పై దాడి

- కన్నుపై రాయితో కొట్టిన అగంతకుడు
- మేమంతా సిద్ధం బస్సు యాత్రలో అనూహ్య ఘటన
- ఎడమ కంటిపై గాయం దురదృష్టకరం: షర్మిల

**విశాలభారతి, ఆంధ్ర ప్రదేశ్:**

ఏపీ సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ ఆగంతకుడు జగన్‌పై రాయితో దాడికి పాల్పడ్డాడు. బస్సుయాత్రలో భాగంగా సింగ్‌నగర్‌కు చేరుకున్న జగన్.. బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. ఈ క్రమంలోనే ఓ ఆగంతకుడు జగన్‌పై రాయిని విసిరారు. అత్యంత వేగంగా వచ్చిన రాయి.. జగన్ ఎడమ కంటి కనుబొమ్మపై తగిలింది. జగన్‌తో పాటు పక్కనే ఉన్న ఎమ్మెల్యే వెల్లంపల్లి ఎడమ కంటికి సైతం గాయమైంది.ఏపీ సీఎం జగన్‌కు వైద్యులు వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అయితే జగన్‌పై క్యాట్ బాల్‌తో దాడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రథమ చికిత్స అనంతరం జగన్ మళ్లీ బస్సు యాత్ర కొనసాగించారు. కాగా, జగన్‌పై దాడిని వైసీపీ నేతలు ఖండించారు. జగన్‌కు వస్తున్న ప్రజాభిమానాన్ని ఓర్వలేక టీడీపీ వర్గాలే ఇలాంటి పిరికిపంద చర్యకు దిగాయని ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వైసీపీ విమర్శించింది. కార్యకర్తలు అందరూ సంయమనంగా ఉండాలని సూచించారు. ఈ దాడిపై రాష్ట్ర ప్రజలందరూ మే 13వ తేదీన సమాధానం చెబుతారని పేర్కొంది.

### ఎడమ కంటిపై గాయం దురదృష్టకరం..

ఏపీ సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడిని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఖండించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ మోహన్ రెడ్డిపై దాడి జరిగి ఎడమ కంటిపై గాయం కావడం బాధాకరం, దురదృష్టకరమని అన్నారు. ఇది ప్రమాదవశాత్తు అయ్యిందని అనుకుంటున్నామని తెలిపారు. అలా కాకుండా ఇది ఎవరైనా కావాలని చేసి ఉంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఖండించాల్సిందేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని అభిప్రాయపడ్డారు. హింసను ప్రతి ప్రజాస్వామికవాది ఖండించాల్సిందే అని వైఎస్ షర్మిల అన్నారు. జగన్ త్వరగా కోలుకోవాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నానని చెప్పారు

## ఒంటరిగానే భరిలో ఉన్నాం

- ఏ పార్టీతో పొత్తు లేదు
- కాంగ్రెస్, బీజేపీలతో దేశానికి ఒరిగేదేమీ లేదు
- పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధం
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ

వివరాలు 2లో



## కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయం



- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- ఎంపి ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు
- బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ యంత్రాంగాన్ని స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంది.
- ప్రజలకిచ్చిన హామీలను కట్టుబడి ఉన్నాం

వివరాలు 2లో




## బీజేపీ సంకల్ప్ పత్ర్

- నేడు ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన 27 మంది సభ్యులతో కమిటీ
- అంబేద్కర్ జయంతి రోజున విడుదలకు ముహూర్తం



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

లోక్‌సభ ఎన్నికల్లో టార్గెట్ 400 చేరుకునేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ప్రజలను ఆకట్టుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది. అన్ని వర్గాలను ఆకట్టుకునేందుకు గల మార్గాలను అన్వేషిస్తోంది. దేశ ప్రజలను ఆకట్టుకునే విధంగా ఇప్పటికే సంకల్ప్ సంకల్ప్ పత్ర్ పేరుతో మేనిఫెస్టోను సిద్ధం చేసింది. దీనిని నేడు విడుదల చేయనుంది. ఇప్పటికే న్యాయ పత్ర్ పేరుతో కాంగ్రెస్ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. దీనికి ధీటుగా బీజేపీ నేడు మేనిఫెస్టోను విడుదల చేయనుంది. ఇప్పటికే గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి రోజు ర్యాలీలు, బహిరంగ సభల్లో ప్రసంగిస్తున్నారు. ఇదే సమయంలో బీజేపీకి చెందిన మరికొందరు సీనియర్ నేతలు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. ఏప్రిల్ 19 నుంచి తొలి దశ ఎన్నికలు ప్రారంభం కావాల్సి ఉండగా బీజేపీ మేనిఫెస్టో విడుదల చేయలేదు. అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14న భాజపా 'సంకల్ప్ పత్ర'ని విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మేనిఫెస్టోను విడుదల చేసే అవకాశం ఉంది. ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతి కావడంతో పాటు నవరాత్రుల పవిత్ర దినాలు జరుగుతున్న నేపథ్యంలో ఈరోజును బీజేపీ ప్రత్యేకంగా పరిగణిస్తోంది. ఈ మధ్య కాలంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ ఓ ప్రచారం







# గుడ్డిగా ఓటువేస్తే ఇబ్బందులు తప్పవు

**మొదటిపేజీ తరువాయి**

కేసీఆర్ అభిప్రాయపడ్డారు. 'లేదంటే.. ఐదు నెలల కింద అడ్డగోలు మాటలు చెప్పినం.. అన్ని పంగనామాలు పెట్టినం.. ఏ పాలసీ సరిగ్గా లేదు.. ఉన్నది కూడా ఊడ గొడుతున్నాం. కరెంటు సక్కగా ఇస్తలేం.. రైతుబంధు కూడా సక్కగా ఇయ్యలే.. పంటలు కొంటలే.. 500 బోనస్ ఇస్తలేం అయినా మాకే ఓటేసింద్రు. మేం ఏం చేయకున్నా ఏమీ అనరు అనే అభిప్రాయం వస్తది. తస్మాత్ జాగ్రత్త.' అని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం మీకిచ్చిన వాగ్దానాలు నెరవేరాలంటే.. ఓటు వేసే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. బలమైన ప్రతిపక్షం ఉంటేనే.. ప్రభుత్వానికి మీరు ఒక సురుకు పెడితేనే మీ అన్ని పనులు అయితాయని అన్నారు. 'లేదంటే.. మేం ఏం చేయకున్నా, మోసం చేసినా, అబద్ధపు వాగ్దానాలు చేసినా మళ్లీ మమ్మల్ని గెలిపించింద్రు అని అంటరు. ఎల్లెలకల పంటరు.. మీకేం చేయరు.' అని పేర్కొన్నారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ గెలవాలని.. అంకుశంలా పనిచేయాలని పేర్కొన్నారు. అప్పుడే ప్రజల కార్యక్రమాలు నెరవేరతాయని అన్నారు.

### మతపిచ్చిలో పడితే మనకు పిచ్చిలేసి పోతాం..

నా మెడ మీద కత్తి పెట్టి రాష్ట్రానికి నిధులు బంద్ చేస్తా.. సంవత్సరానికి రూ. 5 వేల కోట్లు గుంజుకుంటా.. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలన్నాడు మోడీ. నా ప్రాణం పోయినా మీటర్లు పెట్టను అని చెప్పాను. నేను మీటర్లు పెట్టలేదు. ఆనాడు ఏడాదికి రూ. 5 వేల కోట్లు కోసిండు మోడీ. అలా రూ. 30 వేల కోట్ల నష్టం వచ్చింది. రైతాంగాన్ని కాపాడుకోవాలని, వారి బాధలు తెలుసు కాబట్టి, కరెంట్ అవసరం కాబట్టి వాళ్ల మీద భారం పడొద్దని మీటర్లు పెట్టలేదు. ఇప్పుడు బీజేపీకి ఓటేస్తే మాకు ఓటేసింద్రు మీటర్లు పెట్టండి అంటరు. మీటర్లు రావొద్దు అంటే ఓటు వేయొద్దు.. బీజేపీని నేలకేసి గుద్దాలి. అప్పుడే మనకు సరైన తెలివి ఉన్నట్టు.. రాజకీయ పరిజ్ఞానం ఉన్నట్టు. దయచేసి ఆలోచించండి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు పెట్టి ధాన్యం కొన్నాం. మీ బ్యాంకుల్లో డబ్బులు వేశాం. దళారీల బాధ లేకుండా మద్దతు ధర ఇచ్చాం. ధాన్యం ఎక్కువ పండింది కొనాలని ఢిల్లీలో ధర్నా చేశాం. నూకలు తినమని చెప్పినందుకు బీజేపీకి ఓట్లు వేయాల్నా..? మన ఏడు మండలాలు తీసుకుని ఆంధ్రాకు అప్పగించింది. ఏడాదికి 300 మెగావాట్ల కరెంట్ అందించే సీలేరు ప్రాజెక్టులను ఆంధ్రాకు అప్పగించింది. ఐటీఐఆర్‌ను రద్దు చేసింది. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టలేదు. ఏ వర్గానికి న్యాయం జరగలేదు. మత్తులో, మతంలో పడి.. పిచ్చిలో పడి ఓట్లు వేస్తే మనం పిచ్చి లేసి పోతాం తప్ప మన అవసరాలు తీరవు. ఉద్యోగాలు రావు. దేశంలో 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. మొండి బీజేపీ ప్రభుత్వం దాన్ని నింపడం లేదు. గుడ్డి కన్ను మూసిన ఒక్కటే తెరిచిన ఒక్కటే. బీజేపీ ఓటు వేసిన ఒక్కటే వేయకున్న ఒక్కటే అని కేసీఆర్ పేర్కొన్నారు.

## బీజేపీ సంకల్ప్ పత్ర

**మొదటిపేజీ తరువాయి**

జరుగుతోంది. దీంతో అంబేద్కర్ అంటే తమకు ఎంత గౌరవమో చెప్పేందుకు, రాజ్యాంగానికి ఎటువంటి ముప్పు లేదనే సంకేతాన్ని దేశ ప్రజలకు ఇవ్వడం కోసమే ఏప్రిల్ 14న బీజేపీ మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

### మేనిఫెస్టో కోసం కమిటీ

మేనిఫెస్టోను రూపొందించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన 27 మంది సభ్యులతో బీజేపీ మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసింది. అనేక సమావేశాల అనంతరం మేనిఫెస్టోను నాయకులు సిద్ధం చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని మేనిఫెస్టోను తయారుచేసినట్లు తెలుస్తోంది. లక్షన్నర మందికి పైగా వీడియో ద్వారా పార్టీకి తమ సూచనలను పంపారు. నమో యాప్ ద్వారా 40 వేలకు పైగా సూచనలు వచ్చాయి.

## కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల తర్వాత, బీఆర్ఎస్ పార్టీ కనుమరుగడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ తదితర అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, నిందితులెవరిని వదలబోమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసి భార్యాభర్తల సంభాషణలు వినడం సిగ్గు చేటన్నారు. ఏకంగా తాము ఫోన్ ట్యాపింగ్ చేసింది నిజమేనని, పోలీసు అధికారులే అంగీకరించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ యంత్రాంగాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకుందని, దుబ్బాక, మునుగోడు ఉపఎన్నికల్లో ప్రభుత్వ వాహనాల్లో నగదు రవాణా చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు ఒప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే అయిదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాల భర్తీ చేపట్టినట్లు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 30వేల ఉద్యోగాల భర్తీ చేసినట్లు తెలిపారు. మరో 20 వేల ఉద్యోగాలు భర్తీకి సిద్ధంగా ఉన్నాయని, మెగా డీఎస్సీ వేసినట్లు తెలిపారు. ఉద్యోగాల భర్తీతో యువత అనందంగా ఉందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రైతు రుణమాఫీకి, కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే రైతు రుణాలను మాఫీ చేస్తామని, ప్రభుత్వానికి ఆదాయం సమకూరిన వెంటనే రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు పది వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

## కంటోన్మెంట్ పై బీజేపీ ఫోకస్ అభ్యర్థి కోసం వెతుకులాట

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



రాష్ట్రంలో డజనుకు పైగా స్థానాల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలు కీలకంగా మారాయి. పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో జరగబోయే బైపోల్ కు సైతం కాషాయ పార్టీ సిద్ధమవుతోంది. కంటోన్మెంట్ నుంచి గెలుపు గుర్రాన్ని బరిలోకి దించాలని పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. అందుకే బలమైన అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఎవరిని బరిలోకి దించితే బాగుంటుందనే అంశంపై కమలనాథులు దృష్టి సారిస్తున్నారు. కాగా పార్టీ సైతం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాష పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీకి విధేయుడిగా ఉండటం వల్ల ఆయన పేరును పార్టీ పరిశీలిస్తున్నట్లు వినికిడి.

కంటోన్మెంట్ బరిలో ఎవరిని బరిలోకి దింపాలనే అంశంపై ఇతర పార్టీలు సైతం దూకుడు పెంచాయి. ఇప్పటికే కంటోన్మెంట్ అభ్యర్థిని కాంగ్రెస్ ప్రకటించింది. నారాయణన్ శ్రీగణేశ్ కు హస్తం పార్టీ టికెట్ కేటాయించింది. కాగా బీఆర్ఎస్ సైతం లాస్య నందిత సోదరి లాస్య నివేదితకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కాగా అఫీషియల్ గా అనౌన్స్ మెంట్ చేయడమే మిగిలింది. వాస్తవానికి శ్రీగణేశ్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ తరుపున పోటీ చేసి ఓటమి తర్వాత పార్టీ వీడారు. మళ్లీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో చేరి తిరిగి పోటీ చేసి ఓడిపోయారు. ఇదిలాఉండగా కాగా కొద్దిరోజుల క్రితమే కమలం పార్టీకి గుడ్ బై చెప్పి హస్తం పార్టీలో చేరారు. ఎట్టకేలకు టికెట్ సైతం దక్కించుకున్నారు.

అవసరానికి పార్టీలో వచ్చిన గణేశ్ లాంటి వారికి కాకుండా పార్టీ కోసం కష్టపడే వారికి కంటోన్మెంట్ బైపోల్ లో టికెట్ ఇవ్వాలని కమలం పార్టీ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందుకే పార్టీ లైన్ కు కట్టుబడి ఉన్న కొప్పు భాషకు ఇస్తే ఎలా ఉంటుందోనని పార్టీ సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొప్పు భాష దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి. రంగారెడ్డి జిల్లా యాచారం ఆయన స్వగ్రామం. చిన్నతనం నుంచి జాతీయ భావాలు కలిగిన నేత. విద్యార్థి ఉద్యమాల్లోనూ కీలకంగా వ్యవహరించారు. 1999 నుంచి అఖిల భారత విద్యార్థి పరిషత్ లో చురుకైన విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచలుగా ఎదిగారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు చేసి కేసుల పాలయ్యాడు. 2009లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2012లో బీజేవైఎం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2013లో యాచారం గ్రామ ఉపసర్పంచ్ గా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధికి కృషిచేశారు. 2016 నుంచి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2019లో యాచారం ఎంపీటీసీగా ఆయన సతీమణిని గెలిపించుకున్నారు. ఇతర పార్టీల నేతలు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెనుకడుగు వేయకుండా పార్టీ కోసం పనిచేశారు. ఆయన పార్టీకి చేసిన కృషిని గుర్తించి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. కాగా ఇటీవలే ఆయన పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో కొత్తవారిని నియమించారు. జనరల్ స్థానాల్లో అగ్రకులస్తులను దీటుగా ఎదుర్కొని ఆయన పలు ఎన్నికల్లో గెలుస్తూ వచ్చారు. అందుకే పార్టీ ఆయన వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయిని తెలుస్తోంది.

## గిరిజనుల హక్కులపై బిజెపి దాడి

**విశాల భారతి,నేషనల్ బ్యూరో:**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీ పదం అర్థాన్ని మార్చి వారి హక్కులపై దాడిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే.. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని అన్నారు. చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి ఖవాసి లక్మాకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గన్నారు. బస్తర్ లోక్‌సభ స్థానాన్ని ఎస్‌టిలకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ గిరిజన మహిళ అయినందున అయోధ్యలోని రాముని ప్రతిష్ట కార్యక్రమానికి రాకుండా అడ్డుకున్నారని.. బిజెపి మనస్తత్వానికి ఈ ఘటన అద్దం పడుతుందని అన్నారు. ప్రధాని మోడీ ఆదివాసీ పదం అర్థాన్ని మార్చేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. మనం గిరిజనులను ఆదివాసీలని పిలుస్తామని, కానీ మోడీ వనవాసి అని పిలుస్తున్నారని అన్నారు. ఆదివాసీ, వనవాసీ పదాల మధ్య చాలా తేడా ఉందని అన్నారు. ఆదివాసీ అంటే నీరు, అడవి, భూమిపై హక్కులు కలిగి ఉంటారని, వనవాసి అంటే కేవలం అడవుల్లో జీవించే వారని అర్థమని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు మతం, గిరిజనుల సిద్ధాంతాలు, చరిత్రపై దాడి చేస్తున్నాయని ధ్వజమెత్తారు. గిరిజనుల భూములను బిజెపి బిలియనీర్లకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. మోడీ పాలనలో 22 మంది వ్యాపారవేత్తలు 70 కోట్ల మంది భారతీయులకు సమానమై సంపాదనను కూటబెట్టారని దుయ్యబట్టారు.

## కాంగ్రెస్ వైపు గల్ఫ్ కార్మికుల కుటుంబాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాబోయే పార్లమెంటు ఎన్నికలలో గల్ఫ్ కార్మికుల కుటుంబాలు, ఎన్నారైలు కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూలంగా ఉన్నారని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్ లో జరిగిన సమీక్షలో టీపీసీసీ ఎన్నారై సెల్ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ స్వదేశ్ పరికిపండ్లతో నియోజకవర్గాల వారీగా ఉన్న పరిస్థితిని వినోద్ కుమార్ సమీక్షించారు. ఈనెల 16న సీఎం రేవంత్ రెడ్డితో హైదరాబాద్ లో గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఉన్నదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలోనే గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టడం వలన గల్ఫ్ కార్మికుల కుటుంబాలు ఈ ఎన్నికలలో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని వారు నిర్ధారణకు వచ్చారు. గల్ఫ్ వలసలు అధికంగా ఉన్న నిజామాబాద్, కరీంనగర్ ఆదిలాబాద్, జహీరాబాద్, మెదక్, వరంగల్ ఎంపీ స్థానాలలో గల్ఫ్ ఓటు బ్యాంకు ప్రభావం గణనీయంగా ఉంటుందని ఈ నియోజకవర్గాలలో ఎన్నారై విభాగం బృందం ప్రత్యేక ప్రచార కార్యాచరణ చేపట్టిందని వినోద్ కుమార్ తెలిపారు.

## C20 తర్వాత ఇంటర్ ఫలితాలు

- కసరత్తు చేస్తోన్న ఇంటర్ బోర్డు
- ఎన్నికల కోడ్ ఉండడంతో ఈసి అనుమతి కోరిన బోర్డు
- ఒకేసారి,ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,521 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసిమరీ.. ఎంతో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించారు. మూల్యాంకన ప్రక్రియను మార్చి 10 నుంచి ప్రారంభించారు. మొత్తం 4 విడతల్లో ఈ ప్రక్రియను నిర్వహించిన అధికారులు.. ఏప్రిల్ 10వ తేదీన పూర్తి చేశారు. మార్కుల నమోదుతోపాటు ఎలాంటి సాంకేతికపరమైన ఇబ్బందులూ రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో.. ఈసీ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత అధికారులు ఫలితాలను వెల్లడించనున్నారు. ఒకేసారి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెంకండ్ ఇయర్ రిజల్ట్స్ ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. అన్ని ముందస్తు కార్యక్రమాలు పూర్తి చేసుకొని.. ఈ నెల 20వ తేదీ తర్వాత పరీక్షా ఫలితాలు రిలీజ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ నెల 21 లేదా 22 తేదీలలో ఇంటర్ ఫలితాలు ప్రకటించే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది.

## ఒంటరిగానే భరిలో ఉన్నాం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో ఏ పార్టీలతోనూ తమకు ఎలాంటి పొత్తు లేదని ఏఐఎంఐఎం పార్టీ అధినేత, ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ వెల్లడించారు. తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నామని ఓవైసీ తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలతో దేశానికి ఒరిగేదేమీ లేదన్నారు. కేంద్రంలో బీజేపీ తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. పౌరసత్వ సవరణ చట్టం సమానత్వ హక్కుకు విరుద్ధమని, ఈ చట్టాన్ని తాను ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్లోని పీడీఎం కూటమి ఏర్పాటు చేశామని, తమ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నియోజకవర్గంలోని బోగస్ ఓట్లు ఉన్నాయన్న బీజేపీ అభ్యర్థి మాధవీలత ఆరోపణల గురించి ప్రశ్నించగా వారు ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ఇవాళ హైదరాబాద్ పాతబస్తీలోని బహదూర్‌పురా నియోజకవర్గంలోని ఎమ్మెల్యే మొహమ్మద్ ముబీన్ కలిసి హాశమాబాద్, ఆల్ జుబైల్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఓటర్లతో ముచ్చటిస్తూ ఎంఐఎం పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అసదుద్దీన్ ఓవైసీ కోరారు. ఇది కాగా మరోవైపు ఎంఐఎంతో దోస్తీ ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలతోపాటు హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి విజయమే లక్ష్యంగా పని చేస్తోందని వెల్లడించారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. ఈ మధ్య కొందరు కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌తో అవగాహన కుదుర్చుకుంటుందని అపోహలు కల్పిస్తున్నారని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు.

## ధాన్యం సేకరణ సక్రమంగానే జరుగుతోంది

- గ్రామాల్లో ధాన్యం సేకరణపై సమీక్షిస్తున్నాం
- రైతులు వద్దు ప్రభుత్వ కొనుగోళ్లు కేంద్రాల్లో అమ్ముకోవాలి.
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



రాష్ట్రంలో ధాన్యం సేకరణ ఆరోగ్యకరమైన వాతావరణంలో సాగుతుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. ప్రతిరోజు జిల్లాల వారీగా అన్ని గ్రామాల్లో ధాన్యం సేకరణపై తాము సమీక్షిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ పౌరసరఫరాల భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయి, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ పురోగతి, క్షేత్రస్థాయి పరిస్థితులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పందించారు. తాజాగా సాగుతున్న ధాన్యం సేకరణ, పౌరసరఫరాల శాఖ తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ధాన్యం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన దృష్ట్యా రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లకు అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరలు చెల్లిస్తున్నందున రైతులెవరూ ఎంఎస్పీ కంటే తక్కువ ధరలకు అమ్ముకోవద్దని డీఎస్ చౌహాన్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించిన పౌరసరఫరాల శాఖ, ఇప్పటి వరకు 6919 కేంద్రాలు తెరిచి సరకు సేకరిస్తుందని స్పష్టం చేశారు. పల్లెల్లో దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు వద్దు అమ్ముకోవాలని సూచించారు.

## సీబీఐ కస్టడీలో కవిత

- ప్రతి 48 గంటలకు వైద్య పరీక్షలు
- అప్రూవర్ల వాంగ్మూలం ఆధారంగా కవితను ప్రశ్నించనున్న అధికారులు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రెండు రోజుల పాటు సీబీఐ కస్టడీలో ఉండనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను, అప్రూవర్లుగా మారిన వారు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారం చేసుకున్నా దర్యాప్తు సంస్థ అధికారులు ప్రశ్నించనున్నారు. రౌస్ అవెన్యూ న్యాయస్థానం ఆదేశాలతో కవిత శుక్రవారం సీబీఐ కార్యాలయానికి తరలించారు. మద్యం విధానం, అక్రమాల్లో కవిత కీలక సూత్రధారి, పాత్రధారిగా దర్యాప్తు సంస్థ పేర్కొంది. కస్టడీలో ఉన్న కవితకు ప్రతి 48 గంటలకు ఒకసారి అధికారులు వైద్య పరీక్షలు చేయించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఆమె న్యాయవాది, కుటుంబ సభ్యులను కలిసేందుకు కోర్టు అనుమతిచ్చింది. ఈ మేరకు భర్త అనిల్, కేటీఆర్ సహా పీఏ శరత్, న్యాయవాది మోహిత్రావు కవితను కలిసే అవకాశం ఉంది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు అయిన ఎమ్మెల్సీ కవితను ఈడీ కస్టడీ నుంచి సీబీఐ ఆధీనంలోకి తీసుకుంది. ఇప్పటికే ఆమెను అరెస్టు చేసినట్లు ప్రకటించిన సీబీఐ, లోతుగా విచారించేందుకు 5 రోజులు కస్టడీ కోరుతూ గురువారం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్రూవర్ల వాంగ్మూలం ఆధారంగా కవితను ప్రశ్నించేందుకు 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరింది.

కోర్టులో వాదనలు వినిపించిన సీబీఐ తరఫు న్యాయవాది మద్యం కేసులో కవిత కీలక పాత్రధారి, సూత్రధారి అని తెలిపారు. విజయ్ నాయర్, తదితరులతో కలిసి పథకం రూపొందించారని అన్నారు. అందుకు ఢిల్లీ, హైదరాబాద్లో సమావేశాలు జరిగాయని చెప్పారు. కవిత ఆడిటర్ బుచ్చిబాబు వాంగ్మూలం ప్రకారం ఆమె పాత్ర స్పష్టంగా ఉందని చెప్పారు. రూ.100 కోట్లు సౌత్ గ్రూప్ నుంచి సమీకరించి ఆప్ నేతలకు అందించారని వివరించారు. కవిత సూచనతో మాగుంట శ్రీనివాసులురెడ్డి రూ.25 కోట్లు అందజేశారని ఈ విషయాన్ని ఆయన తన వాంగ్మూలంలో వెల్లడించారని స్పష్టం చేశారు. ఈ మేరకు వాదనలు విన్న కోర్టు, ఈ నెల 14 వరకు కస్టడీకి అనుమతిచ్చింది. మరోవైపు అంతకు ముందు రౌస్ అవెన్యూ కోర్టులో కవితకు చుక్కెదురైంది. సీబీఐ ప్రశ్నించడం, అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆమె తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన రెండు పిటిషన్లను సీబీఐ కోర్టు తోసిపుచ్చింది.



- నగరం చుట్టూరా రియల్ ఎస్టేట్ భూమ్
- గతేడాది కంటే రెసిడెన్షియల్ సెగ్మెంట్లో 22శాతం వృద్ధి
- నలువైపులా విస్తరిస్తున్న రియల్ గ్రోత్
- ఎన్నికల తర్వాత పెరగనున్న క్రయవిక్రయాలు

## ధరలు పెరిగినా...

# సిటీలో సొంతిల్లు ఉండాల్సిందే

**విశాలభారతి, హైదరాబాద్ :**
రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ దూసుకు పోతుంది. దేశంలోనే మిగతా మెట్రో నగరాలకు ధీటుగా ముందంజలో ఉంది. ముఖ్యంగా రెసిడెన్షియల్ ఫ్లాట్లు, ఇళ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ధరల వృద్ధిని దృష్టిలో పెట్టుకుని నగరం నలువైపులా స్థిరాస్తులను కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఏటేటా భూముల ధరలు పెరుగుతుంటే, అదే తరుణంలో భవన నిర్మాణ రంగంలోనూ పురోగతి కనిపిస్తోంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో, వచ్చే మూడు నెలల వ్యవధిలో రియల్ ఎస్టేట్ రంగంలో క్రయవిక్రయాలు ఒక్కసారిగా పుంజుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ రంగానికి హైదరాబాద్ హాట్ స్పాట్‌లా మారింది. దశాబ్ధకాలంగా హైదరాబాద్ కేంద్రంగా జరిగిన అభివృద్ధి రియల్ ఎస్టేట్ రంగానికి అత్యంత ప్రాధాన్యత వచ్చింది. దీంతో రాష్ట్రం నలువైపులా నుంచి ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరంలో స్థిరాస్తులను కొనుగోలు చేసేవారి సంఖ్య భారీగా పెరిగింది. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లోని మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ ధరలతో పోల్చితే హైదరాబాద్‌లో కొంత మేర తక్కువగా ఉండటంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇక్కడ స్థిరాస్తులను కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో ఓపెన్ ప్లాట్లతోపాటు రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు విపరీతమైన క్రేజీ వస్తున్నది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వచ్చిన స్థిరపడినవారి సంఖ్య గణనీయంగా ఉండటంతో... ఉద్యోగ, ఉపాధి, మెరుగైన విద్యా, వైద్య అవసరాల రీత్యా హైదరాబాద్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే వారు ఎక్కువైపోతున్నారు. దీంతో క్రమంగా రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు ఆదరణ పెరగడానికి కారణాలు రియల్ నిపుణులు చెప్తున్నారు. అదేవిధంగా శరవేగంగా విస్తరిస్తున్న సిటీ పరిధి, పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు, దీనికి తోడు ఇతర నగరాల కంటే మెరుగైన వాతావరణ పరిస్థితులే రియల్ ఎస్టేట్‌లో హైదరాబాద్ కేంద్రంగా పుంజుకునేందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. ముంబై, చెన్నయ్, బెంగుళూరు వంటి నగరాలు నిత్యం తాగునీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతుంటే.. సిటీలో పుష్కళమైన తాగునీటి వనరులు కొనుగోలుదారులను నగరం వైపు ఆకర్షిస్తూ ఉంది. దీంతో నగరంలో సొంత ఇంటిని కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు పెద్ద పెద్ద ఐటీ, మల్టీ నేషన్స్ కంపెనీలు, విద్యా, ఉపాధి రంగాల్లో అవకాశాలు పెరుగుతుండటంతో నగరం వైపు కొనుగోలుదారులు తొలి ప్రాధాన్యతనిస్తున్నారు.

నగరంలో రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ క్రయవిక్రయాలు జోరందుకోగా, గతేడాది ఫస్ట్ హాఫ్ కంటే 6శాతం పెరిగాయి. వెస్ట్ జోన్ పరిధిలోనే ఈ తరహా విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పుప్పాలగూడ, గోపన్ పల్లి, మణికొండ, నార్సింగి, నల్లగండ్ల వంటి ప్రాంతాలకు వినియోగదారులు కొనేందుకు ఆసక్తి చూపారు. ఈ ప్రాంతాల్లో మెరుగైన రవాణా వ్యవస్థ, ఓఆర్ఆర్ నుంచి ఆనుకుని ఉండటంతోపాటు ఐటీ కారిడార్ పరిధి విస్తరించడంతో ఆ ప్రాంతాల్లో కొనుగోలు చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

### ధరలు పెరిగినా...

**గతేడాది కంటే పెరిగిన బేస్ ధర... పెరిగిన మౌలిక వసతులు, తెలంగాణ హైదరాబాద్ తరహా టైర్ 2 నగరాల కంటే ఎక్కువగా సిటీ వైపే ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఒక్క ఏడాదిలోనే రెసిడెన్షియల్ రియల్ ధరలు చదరపు అడుగుకు రూ. 400 నుంచి రూ. 500 వరకు పెరిగింది. రూ. 400 వరకు పెరగగా, ప్రస్తుతం ఫ్లాటు బేసిక్ ధర చదరపు అడుగుకు రూ. 5200 నుంచి మొదలవుతుంది. కమర్షియల్ ఏరియాకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ఈ ధర మరింత కాస్తా ఎక్కువగానే ఉంది. అయినా సిటీలో స్థిరాస్తి ధరలు పెరిగినా, క్రయవిక్రయాలు మిగతా సిటీల కంటే ఎక్కువగానే ఉన్నాయి.**

### నగరం నలువైపులా రియల్ భూమ్...

సిటీలో విపరీతంగా పెరిగిన రియల్ భూంతో వెస్ట్ జోన్ ఏరియా కమర్షియల్ స్పేస్ కు ధీటుగా రెసిడెన్షియల్ క్రయవిక్రయాలు జరిగాయి. అయితే ఆ ప్రాంతంలో ఇప్పుడు నూతన ప్రాజెక్టుల ధరలు భారీగా ఉండటంతో... కొనుగోలుదారుల చూపు నగరం నలువైపులా ఉన్న ప్రాజెక్టుల వైపు పడింది. దీంతో వెస్ట్ సిటీకే పరిమితం కాకుండా హైదరాబాద్ చుట్టూరా, ఓఆర్ఆర్‌కు దగ్గరగా ఉన్నా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు కేంద్రంగా కొత్త కాలనీలు, రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక క్రమంగా వెస్ట్ సిటీలో పెరుగుతున్న వాహనాల రద్దీ కూడా ఆ ప్రాంతానికి బదులుగా ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. అదే సమయంలో అందుబాటులోకి వచ్చిన రవాణా, మెట్రో వంటి సేవలు ఈస్ట్ వైపు ఉన్న ఉప్పల్, ఎల్బీ నగర్ ప్రాంతాలకు రియల్ భూం క్రమంగా విస్తరిస్తున్నది. ఇక కొత్తగా ఏర్పడే ఐటీ జోన్లు, ఇండస్ట్రీయల్ కారిడార్లకు సమీపంలో ఉన్న సుచిత్ర, కొంపల్లి, దుండిగల్, బాచుపల్లి, బాచుపల్లి, శంషాబాద్, తుక్కుగూడ, ముచ్చెర్ల, షామీర్‌పేట్, పోచారం, ఘట్ కేసర్, బోడుప్పల్, చందానగర్, పటాన్ చెర్, అమీన్ పూర్ వరకు విస్తరించింది. ప్రధానంగా ఈ ప్రాంతాలకు రవాణా మెరుగుపడటంతో జోరుగా ఇళ్లు, అపార్టుమెంట్లు, విల్లాలు, స్టాండ్ ఎలోన్ నిర్మాణాలు పుంజుకున్నాయి. మెట్రో స్టేషన్ల నుంచి కనీసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఉండే ప్రాంతాలకు రియల్ డిమాండ్ భారీగా పెరిగింది. ఇక్కడి నుంచి నేరుగా ఐటీ కారిడార్ వరకు ప్రయాణించేందుకు వెసులుబాటు ఉండటంతోనే ఈ ప్రాంతాల్లో కొనుగోలు చేసేందుకు బయ్యర్లు ఆసక్తిగా ఉన్నారు.

### మిడ్ రేంజ్ నిర్మాణాలకే ప్రాధాన్యత...

సిటీలో గత అర్థ సంవత్సరం నుంచి జరిగిన క్రయవిక్రయాల్లో ఎక్కువగా మీడియం రేంజ్‌లో ఉన్న నిర్మాణాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. రూ. 35లక్షల నుంచి రూ. 60లక్షల లోపు నిర్మాణాలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. తొలి ఆరు నెలలో జరిగిన విక్రయాల్లో ఈ వాటానే 40శాతం మేర ఉందనీ ప్రముఖ రియల్ రంగ సంస్థ జెఎల్ఎల్ వెల్లడించిన నివేదికలో ఉంది. ఆ తర్వాత రూ. 75లక్షల నుంచి రూ. కోటి వరకు ఉండే అపార్టుమెంట్లను కొనేందుకు ముందుకు వస్తున్నారనీ ఆ నివేదికలో పేర్కొంది. అయితే గచ్చిబౌలి, మాదాపూర్ ఏరియాల్లో ఈ ధరల్లో ఎప్పుడూ దాటిపోయాయనీ, రానున్న రోజుల్లో కనీసం రూ. 50లక్షల నుంచే మొదలయ్యే అవకాశం ఉంటుందనీ నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరింత మెరుగ్గా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే రెసిడెన్షియల్ రియల్ భూం శివారు ప్రాంతాలు దాటి సిటీ నలుదిశల మరింత వృద్ధి చెందే అవకాశం ఉందనీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# విడవని పట్టుతో...
# నిరంజన్‌దే ఆదిభట్ల

- అలుపెరుగని నాయకుడిగా చెరిగిపోని ముద్ర
- అనుకున్నది సాధించే వరకు విడిచి పెట్టని మర్రి
- చైర్మన్ పీఠం దక్కించుకోవడంతో పొలిటికల్‌గా మరో సక్సెస్
- నిరంజన్ రెడ్డి ది గ్రేట్ అంటున్న అభిమానులు

**మర్రి నిరంజన్‌రెడ్డి ఈ పేరు వింటే.. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో అలుపెరుగని ఓ పోరాట యోధుడు, అనుకున్నది సాధించేవరకు విశ్రమించని ఓ నాయకుడు గుర్తొస్తాడు. ఎమ్మెల్యే టికెట్ తృటిలో చేజారినా... ఆదిభట్ల మున్సిపల్ పీఠం కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ గుర్తుంటుంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా... సొంత పార్టీ లీడర్లే అడ్డుకుంటున్నా... మొక్కవోని ధైర్యంతో, రాజకీయ చతురతతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు నిరంజన్‌రెడ్డి. ఆదిభట్లలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టి... రాష్ట్రస్థాయిలో తనకంటూ ప్రత్యేక చరిష్మాతో ఎదిగి నేడు 48వ పుట్టినరోజు జరుపుకుతున్న సందర్భంగా ప్రత్యేక అభినందనలతో విశాలభారతి స్పెషల్ స్టోరీ.**

- హైదరాబాద్, విశాలభారతి







ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి, టీ.పీసీసీ సభ్యులు, సీనియర్ నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి చర్చనీయాంశమైన నాయకుడిగా నిలిచారు. ఆదిభట్ల చైర్మన్ ఎన్నిక నిరంజన్‌రెడ్డి ప్రమాణ స్వీకారంతో సుఖాంతమైంది. నిరంజన్‌రెడ్డికి మెజార్టీ సభ్యులు మద్దతు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైపోయింది. చైర్మన్ గిరి కోసం ఐదేళ్ల నుంచి నిరంజన్‌రెడ్డి చేయని పోరాటం లేదు. కాంగ్రెస్‌లోని రాష్ట్రస్థాయి నాయకులంతా నిరంజన్‌రెడ్డివైపే మొగ్గు చూపడంతో ఆయన ఎన్నిక లాంఛనమే అయినా... ప్రమాణస్వీ కారం వరకూ ఉత్కంఠ కొనసాగుతూనే వచ్చింది. గత చైర్ పర్సన్ ఆర్థిక ప్రవీణ్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పటి నుంచి కౌన్సిలర్లందరినీ ఏకతాటికపైకి తీసుకురావడంలో, వారు జారిపోకుండా కాపాడుకోవడంలో నిరంజన్‌రెడ్డి సఫలీకృతుడయ్యారు. అవిశ్వాసంలో నెగ్గినా.. కోర్టు వ్యవహారాలతో కొంత ఆలస్యమైందే తప్ప... ఆయన ఎన్నికను ఆపలేకపోయారు. ఆయన చూపిన రాజకీయ తెగువ నిరంజన్‌రెడ్డే చైర్మన్ పీఠానికి అర్హుడు అనే స్థాయికి అటు ప్రజల్లో, ఇటు నాయకుల్లో బలంగా నాటుకుపోయింది. ఎట్టకేలకు చైర్మన్ పీఠాన్ని దక్కించుకొని, అనుకున్నది సాధించిన నిరంజన్‌రెడ్డికి అందరి మన్ననలు పొందుతున్నారు.

### 'మంత్రి కోమటిరెడ్డి సన్నిహితుడిగా ముద్ర'

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మర్రి నిరంజన్‌రెడ్డి అత్యంత సన్నిహితుడిగా పేరుతెచ్చుకున్నారు. ఆయన సాన్నిహిత్యంతోనే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే టికెట్ కోసం ఆయన విశ్వప్రయత్నం చేశారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం యువతకే టికెట్ ఇవ్వాలని నిరంజన్‌రెడ్డి పట్టుబట్టి కూర్చుకున్నారు. చివరి నిమిషం వరకు పట్టువిడవకుండా పోరాడారు. చివరకు సీనియర్ లీడర్ అయిన మల్‌రెడ్డి రంగారెడ్డికి అధిష్ఠానం టికెట్ కేటాయించడంతో, పార్టీ నిబంధనలకు కట్టుబడి రంగారెడ్డికి మద్దతు తెలిపారు. ఆయన విజయానికి నిరంజన్‌రెడ్డి శాయశక్తులా కృషి చేశారు. ముఖ్యంగా మంచాల మండలంలోని అన్ని తండాలు, గ్రామాలను ఏకతాటిపైకి తెచ్చి ఆ మండలం నుంచి కాంగ్రెస్‌కు మెజార్టీ అందించడంలో నిరంజన్‌రెడ్డిదే ముఖ్యపాత్ర.

## సర్పంచ్ నుంచి... మున్సిపల్ చైర్మన్ వరకు...

నిరంజన్‌రెడ్డి గతంలో ఆదిభట్ల సర్పంచ్‌గా ఆ ఊరికి ఎనలేని సేవలందరించారు. ఆదిభట్ల గ్రామానికి రాష్ట్రస్థాయి గుర్తింపురావడంలో ఆయన కృషి ఎంతో ఉంది. ఆ తర్వాత ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ ఎంపీటీసీగా గెలుపొందిన ఆయన ఎంపీపీగా సేవలందించారు. మండల పరిషత్ సభ్యుడిగా ఉన్న కాలంలో ఇబ్రహీంపట్నం మండలానికి అధిక నిధులు తీసుకురావడం, గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన ముద్ర కనపడింది. మంచాల మండల జెడ్పీటీసీగా నిరంజన్‌రెడ్డి భార్య నిత్య సేవలందిస్తున్నారు. మారుమూల ప్రాంతమైన మంచాల మండలాన్ని అభివృద్ధిలో ముందుంచేందుకు స్థానిక లీడర్లతో కలిసి ఎంతో కృషి చేస్తున్నారు. తాజాగా ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్‌గా నిరంజన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో స్థానిక ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారు. నిరంజన్‌రెడ్డి ముఖ్యంగా ఆదిభట్ల, కొంగరకలాన్ వంటి పెద్ద గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్లడం ఖాయంగా కనబడుతోందని అంటున్నారు.



### 'కలిసి వచ్చిన రాష్ట్ర స్థాయి పరిచయాలు'

**మర్రి నిరంజన్‌రెడ్డికి పీసీసీ సభ్యుడిగా కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఆయనకు అప్పటికే రాష్ట్రస్థాయిలో మంచి పలుకుబడి, అగ్ర నేతలతో పరిచయాలున్నాయి. ఇది నిరంజన్‌రెడ్డికి కలిసి వచ్చే అంశంగా మారింది. అగ్రనేతల ప్రోత్సాహం, అండదండలతో నియోజకవర్గానికి, ఆదిభట్ల మున్సిపాలిటికీ అధిక నిధులు తెచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాదించిన ఆదిభట్ల మున్సిపాలిటీకి మరిన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉందని, ఈ ప్రాంత యువతకు మరిన్ని ఉద్యోగాలు వచ్చే సూచనలు కనబడుతున్నాయని అంటున్నారు.**



## నిరంజన్ వెంట యువజనం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యువతలో నిరంజన్‌రెడ్డికి ఉన్నంత క్రేజ్ మరే నాయకుడికి లేదన్నది అందరూ అంగీకరించే విషయం. ముఖ్యంగా ఎంఎన్ఆర్ యువసేన పేరుతో ప్రతి ఏడాది నియోజకవర్గస్థాయిలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ ఎంతో పేరు సంపాదించింది. ఎంఎన్ఆర్ టోర్నమెంట్‌తో నిర్వహించే క్రీడాపోటీలు ఆయనకు యువతలో ఎంతో గుర్తింపును తీసుకువచ్చాయి. జాతీయస్థాయి క్రీడాకారులను సైతం ఆకట్టుకునేలా ఈ పోటీలను నిర్వహిస్తుంటారు. దీంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆయన అనుచర, అభిమాన గణం పెరుగుతూనే ఉంది. ఇక సామాజిక కార్యక్రమాల్లోనూ ఆయన చూపే ప్రాధాన్యత, కార్యం ఏదైనా, అవసరం ఎక్కడున్నా నిరంజన్ రెడ్డి ఉన్నారనే భరోసా స్థానికుల్లో నిలిచిపోయేలా చేసింది. ఎమ్మెన్నార్ ఆధ్వర్యంలో 2016 నుంచి ఫౌండేషన్ ద్వారా ఇప్పటికీ పేద విద్యార్థులకు పుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేస్తూ ఉన్నారు. ఇకపై సామాజిక సేవ కార్యక్రమాలను మరింత మందికి చేరువ అయ్యేలా ఉంటాయని సన్నిహితులు చెబుతున్నారు.

# జార్జి రెడ్డి చిరంజీవి

**నేను ఆ సంవత్సరమే ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో చేరాను. అది 1971, జనవరిలోనో, ఫిబ్రవరిలోనో అనుకుంటా...... నేను క్యాంపు కొత్త. ఆర్ట్స్ కాలేజీ బస్టాపుకు పోయాను. అప్పుడు రాత్రి ఎనిమిదవు తందనుకుంటా. ముగ్గురు విద్యార్థులు సిటీకి పోవడానికి బస్సు కోసం నిరీక్షిస్తున్నారు. రాజకీయాల మీద. . . . జాతీయ రాజకీయాల మీద జోరుగా మాట్లాడుకుంటున్నారు. రాజకీయాలంటే నాకూ ఆసక్తే. వాళ్ళ మాటల్లోకి నేను దూరిపోయాను. నేనూ రెండు మాటలు మాట్లాడా. మాటల మధ్యలో వారెవరో తెలిసింది. వారిలో ఒకరు కులకర్ణి. సైన్సు కాలేజీలో పి.జి. చదువుతున్నాడు. మరొకరు జార్జిరెడ్డి... .. . ఎమ్మెస్సీ ఫైనల్.. మూడో వ్యక్తి ఎవరో గుర్తుకు రావడం లేదు. అదిగో . . . . . జార్జితో అలా మొదలైంది నా పరిచయం.**

జార్జి మాటల్లో తీవ్రత ఉంది. నిజాయితీ ఉంది. స్పష్టత ఉంది. అంతే....ఆ క్షణమే నేను జార్జికి అభిమానిని అయి పోయాను. మా మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. కాలంతోపాటు అది పెరిగింది. అప్పటి వరకూ నన్ను అంతగా ఆకర్షించిన వ్యక్తి ఎవరూ లేరు. లేదా అంతటి గౌరవాన్ని పొందగలిగిన ఆలోచనా తీవ్రత ఉంటుందని అనుకోలే. ఇదిగో. . . . అలాంటి వాడు. . . . . ఇప్పుడు నాకు సన్నిహితుడై పోయిన వ్యక్తి ఉన్నాడు. ఒక్క రంగం కాదు పలు రంగాలలో నిష్ణాతుడైన వ్యక్తి. చదువులో, నైతిక వర్తనలో, ఆలోచనా స్పష్టతలో ఉన్నత భావం. . . .. మార్పు కోసం చేసే పనిలో అత్యున్నత అంకితభావం. ఇవన్నీ కలబోస్తే జార్జి. కేవలం ఐదున్నర అడుగుల ఎత్తే. అయితేనేం మంచి శరీర దారుఢ్యం గలవాడు. జార్జి బాక్సర్. చెదరని చిరునవ్వుతో ఆకర్షణీయంగా ఉండే ముఖం. . . శత్రువుకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఎప్పుడూ ముందుపీఠాన్నే ఉండేవాడు. .

నేను జార్జి బృందంలో చేరాను. మా గ్రూపు స్టడీ సర్కిళ్ళు నడిపేది. అక్కడ సామాజిక మార్పుకు సంబంధించిన అంశాలను చర్చించేవాళ్ళం. పరిపాలనలో ఇంత అవినీతి ఎందుకుంది? భారతదేశంలో విప్లవ సాధ్యాసాధ్యాలేమిటి? భారత విప్లవం ఏ మార్గం తీసుకుంటుంది? చే గువేరా చేసిన త్యాగం, సాహసం మనం చేయగలమా? ఫ్రెంచి విద్యార్థుల తిరుగుబాటు. . .. .. .ఇలా . . . . . ఎన్నో విషయాలు మా చర్చనీయాంశాలు.

జార్జి పుస్తకాల పురుగు. గంటలు గంటలు యూనివర్సిటీ లైబ్రరీలో గడిపేవాడు. జార్జి చనిపోయిన తర్వాత, జరిగిన ఒక స్మారక సభలో ఒక మిత్రుడు మాట్లాడింది నాకింకా జ్ఞాపకం వుంది. . . లైబ్రరీ బిల్డింగుకు దిగగొట్టిన మేకులు ఎలా ఉంటాయో జార్జి అంతగా లైబ్రరీకి అతుక్కుపోయి ఉండేవాడని ఆ మిత్రుడు మాట్లాడాడు. ఆ మాట నిజమే. అంత ఆబగా చదివేవాడు. రోజూ జిమ్ లో కొన్ని గంటలు గడిపేవాడు. అనేక గంటల లైబ్రరీలో గడిపేవాడు. నిద్రకు కేటాయించిన టైము తప్ప ఇక మిగిలినదంతా చర్చలకే. ఎమ్మెస్సీలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఎమ్మెస్సీ పూర్తయ్యాక ఒక కాలేజీలో జూనియర్ లెక్చరర్ గా పని చేయడం మొదలెట్టాడు. ఎక్కువగా నడిచే పోతుండేవాడు. జార్జికి నడక బాగా ఇష్టం. హవాయి చెప్పులంటే మోజు. నేనూ ఇంకా ఇతర దోస్తులమూ కూడా జార్జిని చూసి హవాయి చెప్పులనే వాడేవాళ్ళం. ఎప్పుడూ నడవడమూ. . . .మాట్లాడ్డమూను. మేమిద్దరమూ ఓసారి చేతులతో మల్ల యుద్ధానికి దిగాం. నా చేయిని కిందకి వంచాలని జార్జి, జార్జి చేతిని కిందకు వంచాలని నేనూ శక్తినంతా వుపయోగిస్తున్నాం. ఉహూ. . . .ఎంతకీ ఫలితం తేలదే. . . అప్పుడు జార్జి అన్నాడు. .పద నడుస్తూ రెజ్లింగ్ చేద్దామని. ఆ రోజుకు అలా ముగిసింది మా పోటీ. .

సైన్సు కాలేజీలో ఎలక్షన్లు. ప్రగతిశీల శక్తులకీ, ఎబివిపీకి మధ్యనే పోటీ. అప్పుడు కాంగ్రెసు పార్టీలో యువ ప్రగతిశీల శక్తుల గుంపు ఒకటి ఉండేది. దాన్లోనే జార్జి, అతని తమ్ముడు సిరిల్ వుండేవారు. ఒకసారి యూత్ కాంగ్రెస్ మీటింగ్ కి వాళ్ళతో కలిసి నేను కూడా ఢిల్లీ వెళ్ళాను. రఘునాధరెడ్డి అని కేంద్ర మంత్రి వుండేవారు. ఆ గ్రూపుకు ఆయనే నాయకుడు. జార్జి, సిరి లతో అతను సన్నిహితంగా ఉండేవాడు. రఘునాధరెడ్డి కుమారుడు శ్రీనాథరెడ్డి కూడా జార్జికి మంచి మద్దతుదారే. శ్రీనాథ్ రెడ్డి ఢిల్లీలో గల ఆలిండియా మెడికల్ సైన్సెస్ ఇన్స్టిట్యూట్ లో గుండె వ్యాధుల నిపుణుడు. జార్జి మరణం తర్వాత జార్జి సోదరుడైన సిరిల్‌రెడ్డి, జార్జి మిత్రులమూ ఒక విద్యార్థి సంఘాన్ని స్థాపించినప్పుడు దానికి పి.డి.యస్.యు. అని పేరు ఖరారు చేశాం.

విద్యార్థి సంఘాల ఎన్నికల్లో ఎ.బి.వి.పి. పోటీ పడుతుండేది. సూర్దాస్, నర్సింహారెడ్డిలు మాకు ప్రముఖ ప్రత్యర్థులు. సిటీ నుంచీ గూండాలను తెచ్చుకునే వాళ్ళు తమకు మద్దతుగా. వాళ్ళు కులకర్ణిని విపరీతంగా కొట్టారు. అతని చెయ్యి విరగొట్టారు. వాళ్ళ ప్రధాన టార్గెట్ మాత్రం జార్జి. ఒక రోజు జార్జిని కలవడానికి వెళ్ళా. ఒంటిమీద చొక్కాలేకుండా కన్పించాడు. ఒళ్ళు చూడగానే షాకయ్యా.. ..వీపుమీద, ఛాతీ మీద ఎక్కడ చూసినా కత్తిపోటు గాయాలే. గూండాలు ముందుగా తమ టార్గెట్స్ ని భయవిహ్వాలులను చేస్తారు. మానసికంగా కుంగిపోయేలా చేస్తారు. గూండాగాళ్ళు కల్పించే భయ విహ్వలతకు మిత్రులు గురికాకుండా ఉండాలంటే నాయకుడు ఎప్పుడూ అగ్రభాగాన ఉండాలనేది జార్జి తర్కం. గూండాలు కిరాయికి వస్తారు. పోరులో వాళ్ళు గట్టిగా నిలబడలేరు. బలంగా ప్రతిఘటించామనుకో తోక ముడుస్తారు. . .. ఇది జార్జి ఆలోచన. జార్జి యోధుడు. సిరిల్ కూడా ఫైటరే. మా కాలేజీ వాడైన యాదగిరి జార్జికి బలమైన మద్దతుదారు. ఫైటింగ్ కి కూడా రెడీ! ఇనుప చువ్వలతో దాడులూ, ప్రతి దాడులూ జరిగేవి. ఇరుపక్షాలకూ దెబ్బలు తగిలేవి. జార్జికీ గాయాలయ్యాయి.

1971లో ఒకసారి జార్జితో కలిసి బొంబాయి పోయే అవకాశం దొరికింది నాకు. ఎంత సంతోషమైందో. జార్జిది న్యూక్లియర్ ఫిజిక్సు. టాటా మౌలిక పరిశోధనా సంస్థ నుంచి, భాబా అణు పరిశోధనా సంస్థ నుంచి జార్జికి ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. నేనూ తనతో వస్తానన్నాను. రైట్ అన్నాడు. నా దగ్గర దమ్మిడీ లేదు. నేను మెరిట్ స్కాలర్షిప్పు మీద లాగిస్తున్నా. జార్జె ఐడియా ఇచ్చాడు. టాటా వాళు తనకు ఫక్లాస్ టికెట్ కు అయ్యే ఖర్చును ఇస్తారు. ఎకానమీ క్లాస్లో ప్రయాణిస్తే ఒక్కరికి అయ్యే ఖర్చుతో ఇద్దరు వెళ్ళొచ్చన్నాడు. టికెట్ ఖర్చు సరే. చేతి ఖర్చులకు? క్యాంటీన్ ఓనరు దయా సేను అప్పు అడిగితే వంద రూపాయలిచ్చాడు. వారికి బొంబాయిలో ఒక మళయాళీ స్నేహితుడున్నాడు. మేం అక్కడికే వెళ్ళాం. అదొక ఇరుకు గది. ఆ మళయాళీ మిత్రుడు మా కోసం అని నైట్ షిఫ్టులో ఉద్యోగానికి పోయేవాడు. ఆయన మంచం మీద మేం పడుకునేవాళ్ళం. ఒకటి రెండు సార్లు రాత్రి షిఫ్టు కాక పగటి షిఫ్టు పడింది. ఇంకేం మేమిద్దరమూ మంచం కింద, మంచంపైన మళయాళీ మిత్రుడు. బొంబాయికి ట్రైయిలో పోతున్నప్పుడు జనరల్ కంపార్టుమెంటులో ఎలా పడుకోవాలో కూడా జార్జి నేర్పాడు. మా వద్ద పెద్దగా లగేజీ లేదు. మాకు దుప్పట్లూ లేవు. కింద శుభ్రం చేసుకోవడం, న్యూస్ పేపర్లు పరుచుకొని పడుకోవడం. అంతే. అప్పుడు ఉత్సాహమే అలా ఉండేది. విలాసాల సంగతి పక్కకు పెట్టండి. సౌకర్యాల గురించి కూడా పెద్దగా పట్టించుకునేవాడుకాదు. మేం వెళ్ళిందేమో వర్షాకాలం. దాదాపు ప్రతిరోజూ వాన పడేది. వానలోనే నడిచేవాళ్ళం. తడి బట్టలతోనే లోకల్ ట్రెయిన్లో ప్రయాణించే వాళ్ళం. అప్పుడప్పుడూ రెండో ఆట సినిమాకెళ్ళే వాళ్ళం. . అవునూ . . . . . చెప్పటం మరిచా. మాతోపాటు యాదగిరి కూడా వచ్చాడు. వారం పది రోజులున్నాం బొంబాయిలో. యాదగిరి మహా సరదా మనిషి. ఇన్నేళ్ళ తర్వాత జ్ఞాపకం తెచ్చుకుంటుంటే అన్పిస్తుంది. నా జీవితంలో అంత ఆహ్లాదకరమైన ట్రిప్పు మరోటి రాలేదేమిటి అని. ప్రయాణ సమయమంతా చర్చలే. జార్జి కొన్ని పుస్తకాలు కొన్నాడు. నాకు బాగా గుర్తుంది. . .

ది స్టూడెంట్ అప్ రైజింగ్ ఇన్ యూరప్ ( యూరప్ లో విద్యార్థి విజృంభణ) అనేది ఆయన కొన్న పుస్తకాల్లో ఉంది. ట్రాట్స్కీ రచనలు కూడా కొన్నాడు. ట్రాట్స్కీ రచనల్లో జార్జికి బాగా ఆసక్తి జనించింది. బాగా ఇష్టపడ్డాడు.

ఉస్మానియా ఇంజనీరింగు కాలేజీలో ఎన్నికల వేడి బాగా ఉంది. క్లాసు రిప్రజెంటేటివ్ గా నేను గెలిచాను. (నాకు పోటీ ఎవరూ లేరు లెండి) మా గ్రూపు నుంచి పెసిడెంటు అభ్యరి యాదగిరి. ప్రచారం బాగానే జరుగుతోంది. యాదగిరికి ప్రత్యరి లఖన్ సింగ్. అతనిది సిటీలోని ధూల్ పేట్. (ధూల్ పేట అంటే గూండాగిరీకీ, గుడుంబా, అక్రమ సారా తయారీకీ ప్రసిద్ధి. అతనికి ఎబివిపి సపోర్టు. రాత్రుళ్ళలో హాస్టళ్ళలో చర్చలు జరుగుతుండేవి. ఇంజనీరింగ్ కాలేజీ వెనక ఉన్న హాస్టల్ (ఇసి హెచ్ 1) లో లఖన్ సింగ్ ధూల్ పేట గూండాలతో క్యాంపు పెట్టాడని హాస్టలు విద్యార్థులు మాకు చెప్పారు. ఎందుకోగానీ ఆ చర్చల్లో నేను లేను. అయితే పరిస్థితి మాత్రం బాగా ఉద్రిక్తంగా ఉంది. నేనప్పుడు కాలేజీలో ఉన్నా. ఎప్పటిలాగే దయా సేర్ క్యాంటీను బయట కూర్చునిన్నాం. జార్జి, సిరిలు కూడా మాతో ఉన్నారు. దామోదర్ కూడా ఉన్నాడు. రాంచందర్ రెడ్డి అనే అతను అదే హాస్టలులో ఉండేవాడు. అతను జాయింట్ సెక్రెటరీ పోస్టుకు అభ్యర్థి. లఖన్ గ్రూప్ అంటే భయపడిపోయాడు. మేం కూర్చున్న దగ్గరికి రాంచందర్ వచ్చాడు. లఖన్ అంటే భయమేస్తున్నదనీ, జార్జిని తనతో రమ్మనమని అన్నాడు. మరో ఆలోచన లేకుండా జార్జి లేచి నిలబడ్డాడు. వెస్పా వెనక సీటు మీద కూర్చుని వెళ్ళాడు. అదే చివరి చూపు అవుతుందని మేమెవ్వరమూ అనుకోలే. రాంచందర్ అడగ్గానే ఏ మాత్రం క్షణం కూడా ఆలోచించకుండా, నిర్లక్ష్యంగా వెళ్ళడం తీవ్ర పర్యవసానాలకు దారితీసింది. హంతకులు జార్జి కోసమే వేచి చూస్తున్నారు. బహుశా రాంచందరను పంపడం ఒక ట్రాప్ అనుకుంటున్నా. దానికి జార్జి పడ్డాడు. హంతక ముఠా పొడవాటి కత్తులతో జార్జి మీద పడ్డారు. ఒళ్ళంతా కత్తి పోట్లే.

జార్జిని పొడిచారని ఎవరో పరిగెత్తుకుంటూ క్యాంటీన్ దగ్గరకొచ్చారు. అక్కడున్న వాళ్ళమంతా జార్జి వెళ్ళిన హాస్టల్ వైపు పరిగెత్తాం. నేల మీద పడి ఉన్నాడు జార్జి. కదలికలు లేవు. నెత్తురు ధారగా కారిపోతోంది. జార్జిని రెంతు చేతుల్లో ఎత్తుకున్నాను. కాలేజీ వైపు మోసుకెళుతూ ఉన్నా. ఇంతలో ఎవరో కారు తెచ్చారు. నేను కారు ఎక్కేలోపే జార్జిని కారులో ఆసుపత్రికి తీసుకుపోయారుఆసుపత్రికి చేరగానే జార్జి మరణించాడని నాకు చెప్పారు.

హతవిధీ! ఆ పరమాద్భుత వ్యక్తి ఇకలేడు. ఆ స్నేహశీలి, చురుకైన మేధావి, రుజువర్తనలో మచ్చలేనివాడు, మార్పుకోసం తపించిన వాడు, పరివర్తన తేవడానికి అంకితమైనవాడు. . . . .మా జార్జి . . . . మన జార్జి. . . . ఆ 1972 ఏప్రిల్ 14న వీరుడిలా మరణించాడు. పాతికేళ్ళప్రాయంవాడు. గొప్ప వారికి మరణం లేదంటారు. వారు చిరంజీవులు. జార్జి చిరంజీవి...... చిరంజీవి జార్జి.

**జావీద్ మీర్జా, జార్జిరెడ్డి మిత్రుడు**



# లక్షలాదిమంది జార్జిరెడ్డిలు ఉద్భవించాల్సిన సమయమిది

## జీనా హైతో మర్నా సిఖో... కదం కదం ఫర్ లడ్నా సిఖో..

**(ఏప్రిల్ 14న కామ్రేడ్ జార్జి రెడ్డి 52వ వర్ధంతి సందర్భంగా...)**

ఉస్మానియా అరుణతార, ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ కెరటం పిడిఎస్ యు సంస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి అమరత్వానికి 52 ఏళ్లు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు 50 ఏళ్లు నిండుతున్న చారిత్రాత్మకమైన సందర్భంలో జార్జి అమరత్వాన్ని మరొకసారి అవలోకన చేసుకోవాల్సిన అనివార్యత నేడు సమాజంపై ఉంది. జార్జిరెడ్డి నాడు చిందించిన నెత్తురు నేటికీ ప్రగతి విద్యార్థి ఉద్యమాన్ని ప్రసవిస్తూనే ఉంది. విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా అంతరాలులేని సమాజం కోసం ఉక్కు పిడికిళ్ళు ఎత్తుతూనే ఉంది. ప్రభుత్వాలు ఎంత నిర్బంధం ప్రయోగించినా కత్తుల వంతెన పై కవాతు చేస్తూ పీడత విద్యార్థి లోకం కోసం మునుముందుకు సాగుతూనే ఉంది.

వియత్నం పోరాటం, 1968 లో ఫ్రెంచ్ విద్యార్థుల తిరుగుబాటు, రష్యా విప్లవ ప్రభావం, చేగువేరా సాహస గాథలు అదేవిధంగా మనదేశంలో జరిగిన నక్సల్ భరీ, శ్రీకాకుళం పోరాటాల ప్రభావంతో కామ్రేడ్ జార్జి రెడ్డి ఉద్యమ తన్మయత్వానికి చెందాడు. ఉద్యమాలతో తెలుగు నేల పులకించిపోయిన సమయంలోనే జార్జి రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి చదువుకోవడం కోసం వచ్చాడు. వీటి ప్రభావంతో కామ్రేడ్ జార్జి రెడ్డి ఎలాగైనా దేశంలో మార్పు తీసుకురావాలని పరితపించాడు. సమసమాజాన్ని కలలు కన్నాడు. స్వతహాగా జార్జిరెడ్డి ధైర్యశీలి. కిక్ బాక్సింగ్ లో నేర్పరి. అత్యంత విజ్ఞానవంతుడు. న్యూక్లియర్ ఫిజిక్స్ లో గోల్డ్ మెడలిస్ట్. జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అనర్గళమైన విశ్లేషణ చేసేవాడు. విద్యార్థులను సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల వైపు నడిపాడు. మొదట ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ (PDS) పేరిట ఫోరంను ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశాడు. ఆ తరువాత ఇదే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం PDSU దేశవ్యాప్తమైంది. ప్రజా పోరాటాలు సామాన్యమైన వ్యక్తులను శక్తులుగా తీర్చిదిద్దుతాయి. అలా కామ్రేడ్ జార్జిరెడ్డిని సామాజిక భౌతిక పరిస్థితులు ఉస్మానియా యూనివర్సిటీలో ధృవతారగా విద్యార్థుల శక్తిగా తీర్చిదిద్దాయి.

1970వ దశంలో గ్రామాల్లో భూస్వాములు పేద ప్రజలపై వెట్టిచాకిరి అణిచివేత దాష్టికాలను కొనసాగించారు. అదే భూస్వాముల పిల్లలు ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ ముసుగు లో అదే పేద ప్రజల కన్న పిల్లలను ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకోవడానికి వస్తే అలాగే అణిచివేత కొనసాగించారు. చదువులకు ఆటంకాలు కల్పించారు. పేద విద్యార్థులపై ఇవ్ టీజింగ్, ర్యాగింగ్ చేసేవారు. విపరీతంగా కొట్టారు. అమ్మాయిలపై లైంగిక వేధింపులు చేసారు. ఉస్మానియా యూనివర్సిటీ లో అడ్మినిస్ట్రేషన్ తో కుమ్మక్కై విపరీతమైన అవినీతికి పాల్పడేవారు. మతోన్మాద కారు చీకట్లు అలుముకున్న ఉస్మానియా యూనివర్సిటీలో ఆనాడు విద్యార్థులకు జార్జిరెడ్డి ఒక వేగుచుక్కగా, అరుణతారగా కనిపించాడు. విద్యార్థుల పక్షం వహించి ఉద్యమించిన కామ్రేడ్ జార్జిరెడ్డి అతికొద్ది కాలంలోనే యూనివర్సిటీ విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నాడు. ఉస్మానియా విద్యార్థులకు జార్జిరెడ్డి లాటిన్ అమెరికా విప్లవకారుడు చేగువేరాలా హీరో అయ్యాడు. నాడు జరిగిన ఉస్మానియా విద్యార్థి సంఘం ఎన్నికల్లో అన్ని కాలేజీల్లో జార్జి నేతృత్వంలో ఉన్న పిడిఎస్ గెలుపొందింది. ఇది సహించని మతోన్మాద శక్తులు జార్జి బతికుంటే వారి ఆటలిక సాగవని గ్రహించి ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్నికల ప్రచారం కొరకు వెళ్లి వస్తున్న జార్జి రెడ్డి పై దూల్ పేట గుండాల సహాయంతో కత్తిపోట్లతో పొడిచి కిరాతకంగా చంపారు. జార్జిరెడ్డిని హతమారిస్తే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ఇక లేకుండా పోతుంది అనుకున్న మతోన్మాదశక్తుల కలలు కలలుగానే మిగిలాయి. జార్జి స్ఫూర్తినందుకున్న విద్యార్థులు నేటికీ దేశవ్యాప్తంగా అసమాన సమాజంపై తిరుగుబాటు జెండాను ఎగిరేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా నాడు కామ్రేడ్ జార్జ్ రెడ్డి ఏ మతోన్మాద శక్తులు హతమార్చాయో నేడు వారే కేంద్రంలో అధికారంలోకి ఉన్నారు. మతోన్మాద విషపు గాలులు నేడు సమాజంలో మరింత పతాక స్థాయిలో వీస్తున్నాయి. సోదర భావంతో ఉన్న ప్రజల మధ్య బిజెపి, ఆర్ఎస్ఎస్ విద్వేషపు అడ్డుగోడలు కడుతుంది. దేశ భక్తి జాతీయత మూసుగేసుకొని పచ్చి పెట్టుబడిదారీ, కార్పొరేట్ విధానాలను అవలంబిస్తుంది. ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుంది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద ప్రజల జీవనం దుర్భరమైంది. పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని ఉద్యమించిన రైతులపై ఢిల్లీలో కాల్పులు జరిపి హత్యలు చేసింది. అనేక ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020, నూతన పాఠ్యప్రణాళిక 2023 తో విద్యను పూర్తిగా కార్పొరేటీకరణ ,కాషాయకరణ చేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుంది. సిలబస్ లో మతోన్మాద భావజాలాన్ని నింపి విద్యార్థుల మెదళ్లను కలుషితం చేస్తుంది. జాతీయ స్థాయిలో విద్యార్థులకు ఇవ్వవలసిన స్కాలర్షిప్, ఫెలోషిప్స్ లపై కోతలను విధిస్తుంది. ప్రతిష్టాత్మక ఐఐటి, ట్రిబుల్ ఐటీ, ఎన్ఐటి లాంటి సంస్థలను ఏ ఒక్కటి కూడా నూతనంగా ఏర్పాటు చేయలేదు. దేశంలో యూనివర్సిటీ లో దళిత విద్యార్థులను వ్యవస్థీకృత హత్యలను చేస్తుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేరుతో జాతీయస్థాయి పరీక్షలను కేంద్రీకృతం చేసి రాష్ట్రాల హక్కులను కాలరాస్తుంది. పదేళ్ల బిజెపి ప్రభుత్వం నూతనంగా ఏ ఒక్క విద్యా సంస్థను ఏర్పాటు చేయలేదు. ప్రజల భావోద్వేగాలను ఆసరా చేసుకుని మళ్లీ అధికారంలో రావడం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. అధికారంలోకి వస్తే ఒక్కొక్కరి ఎకౌంట్లో పది లక్షల వేస్తానని రామ మందిరం పేరుతో 10 గ్రాముల అక్షింతలు పంపించారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయలను బిజెపి పార్టీ దండుకుంది. రాజ్యాంగబద్ధ సంస్థలైన సిబిఐ, ఈడి లను రాజకీయ అవసరాల కోసం వాడుకుంటుంది. ప్రశ్నించే మేధావులను, రచయితలను ఉద్యమకారులను భౌతికంగా హతమార్చడం, లేదంటే జైలులో వేసి ఫాసిస్టు విధానాలను ప్రయోగిస్తుంది. భారతదేశాన్ని కారు చౌకగా అంబానీ ఆదాని లాంటి కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతుంది. దేశ సంపదనంతా వారికే దోచిపెడుతుంది..ఇలాంటి ఆపద సమయంలో జార్జిరెడ్డి లాంటి శక్తుల అవసరం నేడు ఎంతగానో ఉంది. దేశంలో అములుకుంటున్న ఫాసిస్టు విషపు గాలులను తరిమి కొట్టడానికి లక్షలాదిమంది జార్జిరెడ్డిలు ఉద్భవించాల్సిన సందర్భం, సమయమిది.



**మహేష్,**
**పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు,**
**9700346942**

# అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం - డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్

● బాబాసాహెబ్ గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశ చరిత్రలో ఒక స్మారక వ్యక్తి. భారతదేశంలో అంబేద్కర్ జయంతిగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న ఆయన జయంతి వేడుకల ద్వారా గౌరవించుకుంటాం. అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం. అగ్రకుల దురహంకారంపై గొంతెత్తిన స్వరం...భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్. భారతదేశ ప్రజల్లో సమానత్వం కోసం అహర్నిశలు తపించిన కృషీవలుడు అంబేద్కర్. బ్రిటీష్ పాలకుల కబంధ హస్తాల నుంచి దేశమంతా స్వేచ్ఛావాయువుల కోసం తపిస్తోన్న స్వాతంత్ర్యోద్యమ కాలంలో బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన ధీశాలి. ఆ మహనీయుని 134వ జయంతిని ఇవాళ దేశం మొత్తం జరుపుకుంటోంది.

● 1891లో ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అంబవాడేలో,.అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన 'మౌ'అన్న ఊరిలో లో జన్మించారు. దీనిని ఇప్పుడు డాక్టర్ అంబేద్కర్ నగర్‌గా పిలుస్తారు. (స్వాతంత్ర్యం రావడానికి పూర్వమున్న మహారాష్ట్ర, ఇప్పుడు మధ్యప్రదేశ్ లో ఉంది) డా.భీమ్ రావ్ అంబేద్కర్ తన తల్లిదండ్రులకు 14వ సంతానం. అందరికంటే చివరివాడు. అతని అసలు ఇంటిపేరు అంబావాడేకర్. అయితే దానిని అతని ఉపాధ్యాయుడు పాఠశాలలో అంబేద్కర్‌గా మార్చారు. చదువుకోవాలన్న., మంచి నీళ్ళు తాగాలన్నా కులమే అడ్డుగా నిలబడింది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. సమాజంలో వర్ణ, వర్గ భేదాలు ఉండొద్దని రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. ఎందరికో ఆరాధ్యుడయ్యారు.

● భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భారత దేశానికి లభించిన గొప్ప ఆస్తి. ఆయన ద్వారానే భారతదేశానికి గొప్ప ప్రజాస్వామ్యం అందింది. భారత రాజ్యాంగం ప్రధాన రూపశిల్పి డా బి ఆర్ అంబేద్కర్. భారతదేశంలో దళిత చైతన్యానికి కూడా ఆయన ఎంతో కృషి చేశారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలకు ఆయన గొంతుగా మారారు. తరతరాలుగా బడుగు, బలహీనవర్గాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా అంబేద్కర్.. వారి అభ్యున్నతకి రిజర్వేషన్లు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అలాగే అంటరానితనం, అస్పృశ్యతను శిక్షార్హమైన నేరంగా చేశారు. అంతేకాదు ఆర్థికవేత్తగా కూడా ఎంతో గొప్పగా పేరు సంపాదించారు. పారిశ్రామికీకారణ, వ్యవసాయాభివృద్ధి దేశానికి ఊతమిస్తాయని బలంగా నమ్మారు.

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 64 సబ్జెక్టులలో ప్రావీణ్యం సంపాదించారు. ఆయనకు 9 భాషలపై పరిజ్ఞానం ఉంది. దాదాపు 21 సంవత్సరాల పాటు ప్రపంచంలోని అన్ని మతాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. అంబేద్కర్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో కేవలం 2 సంవత్సరాల 3 నెలల్లో 8 సంవత్సరాల చదువును పూర్తి చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి "డాక్టర్ ఆల్ సైన్స్" విలువైన డాక్టరేట్ పట్టా పొందిన ప్రపంచంలోనే మొదటి, ఏకైక వ్యక్తి అంబేద్కర్ కావడం విశేషం.

● భారతీయ త్రివర్ణ పతాకంపై "అశోకచక్ర"కు స్థానం కల్పించిన ఘనత డా.బి ఆర్ అంబేద్కర్‌కి చెందుతుంది. ఆయన పుస్తకం "వెయిటింగ్ ఫర్ ఎ వీసా" కొలంబియా విశ్వవిద్యాలయంలో పాఠ్య పుస్తకంగా ఉంది.. ప్రపంచవ్యాప్తంగా ఏ నాయకుడి పేరుతోనైనా అత్యధిక సంఖ్యలో పాటలు, పుస్తకాలు ఉన్నాయంటే అది అంబేద్కర్‌కి మాత్రమే.

● ప్రపంచంలోనే అతిపెద్ద గ్రాంధలయాలలోనే ఒకటి అయినా లండన్ లైబ్రరీలో అత్యధిక పుస్తకాలను చదివిన వారిలో మొదటి వ్యక్తి ప్రపంచ చరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కారల్ మార్క్స్ అయితే, రెండవ వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్

అంబేద్కర్ పార్లమెంట్ సభ్యుడిగా ఎంపికైన తర్వాత వారసత్వ, వివాహ చట్టాలలో లింగ సమానత్వాన్ని వివరించడానికి ప్రయత్నించిన హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను పార్లమెంటులో నిలిపివేయడంతో.. 1951లో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత అంబేద్కర్ తన జీవితంలోని ముఖ్యాంశాలను తన ఆత్మకథ 'వెయిటింగ్ ఫర్ ఏ వీసా'లో రాసుకున్నారు. అంబేద్కర్ తీవ్రమైన మధుమేహం వ్యాధితో బాధపడుతూ 1954లో డిసెంబర్ 6న తన ఇంట్లోనే కన్నుమూశారు.

● న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్.



**జాజుల దినేష్.**
**పొలిటికల్ సైన్స్ లెక్చరర్. 9666238266**



# బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరికలు

**బాల్కొండ, విశాల భారతి:**బాల్కొండ నియోజకవర్గం బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జాపు భూమన్న,మెండోరా మండలం పోచంపాడ్ ఆమ్రాయి తాండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహతో పాటు 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఆయన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ప్రజా పాలనలో భాగస్వామ్యంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయడానికి పార్టీలో చేరుతున్నట్లు చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరత్ ప్రసాద్ గెలుపు తథ్యం

■ **బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రామ్**



**వనపర్తి విశాల భారతి::** భారతీయ జనతా పార్టీ బలపరిచిన పార్లమెంటు సిగ్మెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ గెలుపు తథ్యమని బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రామ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం లోని 23, 24 ,25, 26 వార్డులలో గడపగడపకు ప్రచారం చేస్తూ.. భారతీయ జనతా పార్టీ అనగానే వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి సంక్షేమ పలాన అందించిందని ప్రచారంలో ప్రతిపటికి వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి మోడీ ప్రపంచ దేశంలోనే ఉత్తమమైన నాయకుడిగా పేరు ప్రతిష్ట తీసుకున్న నాయకుడని, ఆర్థిక వ్యవస్థను, టెర్రరిజాన్ని, త్రిబుల్ తలాక్, ఆర్టికల్ 370, వంటి అనేక అంశాలపై సమగ్ర మార్పులు తీసుకొచ్చి ప్రతి ఒక్కరికి భారతదేశ పౌరుడిగా గర్వంగా చెప్పుకోగల్తున్నామని ఆయన అన్నారు. హ్యాట్రిక్ ప్రధానమంత్రిగా మరోసారి నరేంద్ర మోడీ పట్టం కడుతున్నారని ప్రతి ఒక్కరూ ఆయన చేసిన అభివృద్ధికి సహకరించి ఓటేస్తామని పిలుపునిస్తున్నారన్నారు. ఆయన వెంట బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

■ **అదనపు కలెక్టర్**

**ధర్పల్లి, విశాల భారతి:**వరి ధాన్యం కొనుగోలు మీద శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం లో ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్లు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ధర్పల్లి మండలం హోన్నజిపేట్ గ్రామంలో గల ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్ పరిశీలించడం జరిగింది. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఏదైనా ఇబ్బందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధర దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం సూచించిన వరి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం అమ్మలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్, డిఆర్డిఏ పిడి సాయగౌడ్, డిపిఎం సాయిలు, తాసిల్దార్ మాలతీ, ఎంపీడీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సురేష్ శెట్కర్ గెలుపుకు తిరుగులేదు



**నారాయణఖేడ్, విశాల భారతి:**జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ కుమార్ శెట్కర్ గెలవ బోతున్నారు అని నారాయణాఖేడ్ నియోజకవర్గం చెప్తా గ్రామంకు చెందిన కాంగ్రెస్ యువ నాయకులు శేరికర్ నందు అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా అత్యంత మెజారిటీ తో సురేష్ కుమార్ శెట్కర్ గెలవ బోతున్నారు అని.. అవినీతి బి బి పాటిల్ కి ప్రజలు బై బై చెపుతారు అని అన్నారు. సురేష్ షేట్కార్ గెలుపుకు ఆయన ఎంపీ, ఎమ్మెల్యేగా ఉన్నపుడు చేసిన అభివృద్ధి జాతీయ 161, రైల్వే లైన్ ప్రతిపదన, ప్రతి నియోజకవర్గం మోడల్ స్కూల్, డిగ్రీ కాలేజీ లు, లింగయత్ లను బీసీ లుగా మార్చడమే కాకుండా లింగయత్ కార్పొరేషన్ ఏర్పాటు కు చేయడం వంటి అభివృద్ధి పనులు చేశారు. బీజేపీ అభ్యర్థి తన ఆస్తులు కాపాడడం కోసం పార్టీ మార్చడం జరిగింది ఇసుక మాఫియా, రైతుల భూములు ఆక్రమిచడం వంటి అక్రమాలకు పలుపడడం వంటి అవినీతి చేసిన బి బి పాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ ప్రజలు తరిమికొడతారు అని తెలిపారు.

# జలియన్ వాలాబాగ్ మృతులకు నివాళులు



**మందమర్రి టౌన్, విశాల భారతి** దేశ స్వతంత్ర సంగ్రామంలో అత్యంత దురదృష్టకరమైన ఘటన అయినటువంటి జలియన్ వాలా బాగ్ సంఘటనలో మృతి చెందిన వారికి మందమర్రి పట్టణానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పిహ్వాల్ ఆయన సతీమణి రాణి పిహ్వాల్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 13 1919లో అమృత్సర్ పట్టణంలోని జలియన్ వాలాబాగ్ తోటలో వైశాఖ పర్వదినాన స్వతంత్ర ఉద్యమంపై సమావేశమై రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఈ క్రమంలో నిరాయుధులైన స్త్రీ పురుషులు పిల్లలపై జనరల్ దయ్యర్ సారాధ్యంలోని బ్రిటిష్ సైనికులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. 1650 రౌండ్ల కాల్పులు పదినిమిషాల పాటు కాల్పులు కొనసాగించారు. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ దుర్ఘటనలో 379 మంది మరణించారు. ఇతర గణాంకాల ప్రకారం వెయ్యి మందికి పైగా మరణించగా 2000 మంది పైగా గాయపడ్డారని వివరించారు. దేశానికి స్వతంత్రం సాధించాలని ఎంతోమంది మహానుభావులు తమ మానప్రాణాలను లెక్కచేయకుండా నిర్బంధాలకు ఎదురెళ్లి పోరాటం చేశారని, దేశం స్వతంత్ర ఉద్యమ సంగ్రామం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

# మోడీ చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

■ **బి బి పాటిల్**



**నారాయణ ఖేడ్, విశాల భారతి:**నారాయణఖేడ్ లోని బిజెపి కార్యాలయంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో ఇతర పార్టీలకు చెందిన 100 మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. జహీరాబాద్ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి హవా నడుస్తోందని, దేశ ఖ్యాతిని మోడీ ప్రపంచ నలుమూలల చాటారని అన్నారు. ఈ పదేళ్లలో మోడీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బిజెపిని మూడోసారి అధికారంలోకి తీసుకొస్తాయని , మోడీ మూడోసారి ప్రధాన మంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ ,అధికార ప్రతినిధి సంగప్ప ,బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి ,మహిళానాయకులు పల్లె వీరమని,రాథోడ్ సంతోష్ ఎస్టీ మోర్చా నాయకులు, మండల అధ్యక్షులు దశరథ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్యం లోపిస్తే అధికారులపై చర్యలు తప్పవు

**వనపర్తి విశాల భారతి::** జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో మార్నింగ్ వాక్ లో భాగంగా వార్డులను మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్ శనివారం సందర్శించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు, అంతర్గత డ్రైనేజ్, లోపించిన పారిశుద్ధం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వేసవికాలంలో ఎంతో కష్టపడి పనిచేసిన పారిశుధ్య కార్మికులు, వారి పనులు వాళ్ళు చేసుకుని వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే అధికారులపై చర్యలు తప్పవు అని అన్నారు. జిల్లా కేంద్రంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ పగలు రాత్రి తినలేకుండా ప్రజలపై కాటేసి పరిస్థితి దాపరించడంతో మున్సిపల్ శాఖ అధికారులకు చైర్మన్ కుక్కలను తరలించాలని ఆదేశించడంతో మూడు రోజులుగా దాదాపు 300 కుక్కలను తరలించారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ ఛీర్ల సత్యం సాగర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**భీమదేవరపల్లి విశాల భారతి** సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మంగళపల్లి, రత్నగిరి, గాంధీనగర్, మాణిక్య పూర్, గ్రామాల్లో పారా మిలిటరీ సెంట్రల్ ఫోర్స్ సిఆర్పిఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉండేందుకు మార్చ్ నిర్వహించామన్నారు. త్వరలో ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి వర్గ భేదాలు అల్లర్లు లేకుండా ఉండేందుకు మండలం లో ఆయా చోట్ల కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం వాహనాలను వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు.



# మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత

**మందమర్రి టౌన్, విశాల భారతి** పట్టణంలోని మూడవ జోన్ లో నివాసముంటున్న మేకల శ్రీనివాస్, ఠాగూర్ ప్రతాప్ సింగ్, కలువల శ్రీనివాసులు గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీరి విషయం తెలుసుకున్న పట్టణ మిత్ర బృందం శనివారం వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. అంతేగాక రాబోయే రోజుల్లో వారికి ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.



# బాల్య మిత్రునికి ఆర్థిక సాయం

**చిగురుమామిడి, విశాల భారతి:**మిత్రుని కోసం మేమున్నామంటూ ఓ బాల్య మిత్రునికి ఆర్థిక సాయం అందించారు చిన్న నాటి బాల్య మిత్రులు. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన బోయిని శివకుమార్(40) గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రి పాలు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని తెలుసుకున్న రేకొండ 199697 పదవతరగతి బాల్యమిత్రులు శనివారం శివకుమార్ కు 15వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో తీగల ఆంజయ్య, తాట్ల తిరుపతి, తమ్మిశెట్టి రాములు, తీగల చంద్రమౌళి, చెంజర్ల తిరుపతి, కె. మధు, నాంపల్లి మురళి, మెడవేణి రమేష్,కొమ్మెర తిరుపతి రెడ్డి, పంకర్ల శ్రీనివాస్,ఎగ్గిడి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్ ,మండల అనిల్, అప్పాల సదానందం ఎరుకొండ రాజు, మోర తిరుమల, అందె సరస్వతి,రాజ్యలక్ష్మి, తిరుమల, ఉమ, తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ కు వినూత్న నివాళి

**నారాయణఖేడ్, విశాల భారతి**నారాయణఖేడ్ కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ భారత రాజ్యాంగ రూపకర్త, భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని వివిధ రూపాలలో స్క్రాచింగ్ పద్ధతి, మర్రి ఆకు పైన, రావి ఆకు స్కెలిటన్ పైన, రావి ఆకు మీద అంబేద్కర్ చిత్రాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.



# బిజెపి జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్

■ **అభినందించిన ఎంపీ బండి సంజయ్**

**చిగురుమామిడి, విశాల భారతి:**భారతీయ జనత పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు పొన్నం శ్రీనివాస్ ను నియామిస్తూ బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణరెడ్డి శనివారం నియామక పత్రం అందజేశారు. నియామాకం పత్రం అందజేసిన అనంతరం బిజెపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ శ్రీనివాస్ ను అభినందించారు. పార్టీ ఆభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని, రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా ఆత్యధిక మోజార్టీతో తనను గెలిపించాలని వారికి పిలుపునిచ్చారు. తన నియామాకానికి కృషి చేసిన పార్టీ శ్రేణులందరికి శ్రీనివాస్ ధన్యావాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, బండి సంజయ్ కుమార్ గెలుపుకోసం నిరంతరం సైనికుడీలా పని చేస్తానని పొన్నం శ్రీనివాస్ చెప్పారు. బిజెపి పార్టీలో చురుకుగా పనిచేస్తున్న పొన్నం శ్రీనివాస్ ను జిల్లా ఆధికారప్రతినిధిగా నియామించటం పట్ల పలువురు పార్టీ నాయకులు, కర్యకర్తలు, శ్రీనివాస్ భిమానులు హర్షం వ్యక్తం చేస్తు శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# జాతీయ నంది అవార్డు గ్రహీతకు సన్మానం

**పాలకీడు, విశాలభారతి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణా రాష్ట్రం నుండీ సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం జానపాహాడ్ దర్గ కల్ మేట్ తండాకు చెందిన గిరిజన ముద్దు బిడ్డ ధరావత్ బాల్ సన్ నాయక్ మాజీ బోర్డ్ మేంబర్ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ మండలి ప్రధాన కార్యదర్శికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తేదీ 13/4/2024 నాడు ఉగాది నంది అవార్డు పురస్కారాలు రాజా మహేంద్రవరం తూర్పు గోదావరి జిల్లా లో జాతీయ నంది అవార్డు ను ఫీలోన్త్రాఫిక్ సొసైటీ వారు. ఎనిమిదివ anniversary సందర్భంగా నంది అవార్డు ప్రదానం చేయడం జరిగింది. ఈ క్రింది సేవలకు గాను మాతృ భాష. గిరిజన సంక్షేమం సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ లో భాగంగా తెలుగు భాషా. సాహిత్య, సామాజిక, రాజకీయ విద్య, వైద్య, క్రీడా, కళా రంగాలలో చేసిన సేవలను గుర్తించి అవార్డు అందుకొవడం జరిగింది. మొదటి సారిగా ఈ అవార్డు అందుకోవడం మరింత బాద్యత ను పెంచినట్లు గా భావిస్తున్నాను నాకూ ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**చిట్యాల, విశాలభారతి:** మండలంలో గత కొద్ది రోజులుగా పలుచోట్ల దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ సైధాబాబు కోరారు.ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలు, పట్టణం లో రాత్రి వేళలో దొంగతనాలు ఎక్కువ గా జరుగుతున్నాయని ఆరుబయట నిద్రిస్తున్న మహిళల మెడలో నుండి ఆభరణాలు దొంగిలిస్తున్నారని తెలిపారు. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంటే జాగ్రత్త పర్చుకోవాలని, తాళం వేసిన ఇళ్ళలో దొంగలు పడటానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి,మీరు తాళాలు వేసి వెళ్తే తాళం వేసినట్టు కనపడకుండా కర్టన్లు వేసుకోవాలని,ఇంట్లో ఒక లైట్ వెలిగేలా చూసుకోవాలని అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అలాంటి వ్యక్తులు కనబడితే వెంటనే డయల్ 100కి గానీ, పోలీసు వారి నంబర్ 8712670187 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

■ **ఎస్సై లక్ష్మీ నరసయ్య**



**పాలకవీడు, విశాలభారతి:** మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో ఎన్నో అపరిచిత మెసేజెస్ వళ్ల ప్రజలు ఎంతో భయ బ్రాంతులకు గురి అవుతున్నారు అని, అపరిచిత వ్యక్తులు తమకు ఫోన్ చేసి ఓటిపి లాంటి నెంబర్స్ అడిగితే అటువంటిది చెప్పకూడదని సూచించారు. అలాగే మాదకద్రవ్యాలు గంజాయి లాంటిది సరఫరా చేసిన వాడిన చట్టపరమైన చర్యలు తప్పవని సూచించారు, వీటి వాడకం ప్రస్తుత కాలంలో ఎక్కువగా వాడుతున్నారు, ముఖ్యంగా యువత వీటికి బానిస అయ్యి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అని, తల్లి దండ్రులు కూడా వారి పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి అని,ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టం తన చేతుల్లోకి తీసుకొని సదరు వ్యక్తులకు దాడి చేస్తే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అంజి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు




## ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగు మేలు

- సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపయ్య

**మోతె, విశాలభారతి**: శనివారం మోతె మండలంలో అధికంగా కూరగాయలు సాగు చేస్తున్న రావికుంట తండాలో కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత 60 సంత్సరాలుగా రసాయనాలు ఉపయోగించి కూరగాయలు సాగుచేస్తున్నామని, దీంతో రోగాలబారిన పడుతున్నామన్నారు. నేలలో భూసారం తగ్గి రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయన్నారు. కాబట్టి ఇప్పటి నుండి మనతో పాటు మన భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. నేల సారం పెరగాలంటే పచ్చి రొట్ట ఎరువులు, పశువుల ఎరువు, ఆకులు, అలములు వంటి వ్యర్థ పదార్థాలు వాడాలన్నారు. ఇంకా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడితే నేల సారం బాగా పెరుగుతుందన్నారు. అలాగే చీడ పీడల నివారణకు వేపాగింజలకషాయం, నీమస్త్రం, బ్రహ్మాస్త్రం, ఇంకా పలు రకాల ద్రావణాలు వాడితే సమర్థవంతంగా నివారించవచన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మల్సూర్, రైతులు రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా బండ మధుకర్ రెడ్డి

**రామన్నపేట, విశాలభారతి**: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రామన్నపేట మండల కొమ్మాయి గూడెం గ్రామానికి చెందిన బండ మధుకర్ రెడ్డికి బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ నియామక పత్రం అందజేశారు. అనంతరం బండ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి నకి రేకంటి మొగులయ్య జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలుపు కోసం కృషి చేస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వనం అంజయ్య, దవనూరి వెంకటేశం పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

- ధనుంజయ నాయుడు



**మిర్యాలగూడ, విశాలభారతి:** ఈనెల 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా భారతరత్న రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని బీసీ సాంస్కృతిక సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఓటు హక్కు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కేవలం కొంతమందికి మాత్రమే ఓటు హక్కు ఉండాలన్న నాటి జాతీయ నేతల మెడలు వంచి ఓటు అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అందరికీ ప్రజాస్వామ్యం దేశంలో ఓటు హక్కు ఉండాలని నినదించి విజయం సాధించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా రిజర్వేషన్లు కల్పిస్తే అసమానతలు లేని గొప్ప సమాజం ఏర్పడుతుందని ఎన్నో కలలు కని, భారత రాజ్యాంగం రూపొందించాడని ఈనాడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలే ముఖ్యకారణమని అన్నారు. ఆయన ఆశయ స్ఫూర్తితో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు.

## మోడీ మూడోవ సారి ప్రధాని అవ్వడం ఖాయం

- పబ్బు వంశీ గౌడ్ బీజేవైఎం మండల అధ్యక్షులు



**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారతీయ జనతా యువమోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షులు పబ్బు వంశీ గౌడ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 400 సీట్లు కైవసం చేసుకుంటుందని అలాగే నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి చేసి ఎర్రకోటపై మూడోసారి భారతీయ జనతా పార్టీ జెండాను ఎగరవేయడం ఖాయమని, అలాగే తెలంగాణలో అత్యధికంగా సీట్లు సాధించి తెలంగాణ నుంచి నరేంద్ర మోడీ గారికి భువనగిరి పార్లమెంట్ బహుమతి గా ఇస్తామని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన పనులే మళ్ళీ బీజేపీ ని గెలిపిస్తాయని అయన అన్నారు. బీజేపీ పార్టీ నాయకులు బూత్ స్థాయి నుండి బాగా పనిచేయాలని ప్రతి ఓటరును కలసి మోడీ చేసిన అభివృద్ధిని తెలియచేయాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వినయ్ రెడ్డి అంతటి నరేష్ సన్నీ లింగస్వామి మల్లికార్జున్ శివ రామ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**శాలిగౌరారం, విశాలభారతి:** ప్రాజెక్టు తీర ప్రాంతాన్ని పల్లివాడ, సురారం తో పాటు కాలువ తీరా ప్రాంతాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాలిగౌరారం ప్రాజెక్టులోని పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు అధికారులు ప్రత్యేక తీసుకొని రైతులకు నీటిని అందించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. చెరువులోకి నీరు సాఫీగా వచ్చేలా తగు చర్యలు తీసుకురానికి అధికారులు అప్రమత్తం కావాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చాడ సురేష్ రెడ్డి పిఎసిఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి, గోదల వెంకట్ రెడ్డి, మద్ది వెంకట్ రెడ్డి, ఎస్.కె జహంగీర్, పడాల సైదులు, జమ్మూ అశోక్, పడాల వెంకన్న, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీలోకి రండి.. మద్దతు ఇవ్వండి..ఎంపీగా గెలిపించండి

- తెల్లాపూర్ కౌన్సిలర్ భరత్, సీనియర్ నేత సత్తయ్యను కలిసిన నీలం మధు
- కాంగ్రెస్ లోకి ఆహ్వానించిన కాంగ్రెస్ అభ్యర్థి

**పటాన్ చెరు,విశాలభారతి:** తెల్లాపూర్ మున్సిపల్ ఇండిపెండెంట్ కౌన్సిలర్ కొల్లూరి భరత్, ఆయన తండ్రి సత్తయ్యను మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. తనకు మద్దతిచ్చి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి, ఎంపీ ఎన్నికలలో సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా భరత్, సత్తయ్య నీలం మధుకు భరోసా ఇచ్చారు. ప్రజా సేవ చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్నానని, ఈ ప్రాంతం నుంచి సహాయ సహకారాలు అందించి, తన గెలుపునకు తోడ్పడాలని నీలం మధు ఈ సందర్భంగా వారిని విజ్ఞప్తి చేశారు. నీలం మధు వెంట తెల్లాపూర్ మున్సిపల్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, బాబు గౌడ్, గడ్డం శ్రీశైలం, రుద్రారం వెంకన్న, మధు, పాండు, బిక్షపతి, రాకేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## శంకర నేత్రాలయం సేవలు అభినందనీయం

- గుండ్రాంపల్లిలో ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

**చిట్యాల, విశాలభారతి:** అమెరికన్ తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో చెన్నైకి చెందిన శంకర కంటి వైద్యశాల అందిస్తున్న సేవలు అభినందనీయమని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన ఏసిరెడ్డి శ్రీరామ్ రెడ్డి, ఏసి రెడ్డి కృపాకర్ రెడ్డిల జ్ఞాపకార్థం అమెరికన్ తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏసి రెడ్డి కరుణాకర్ రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ ఏసి రెడ్డి దయాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆట, శంకర కంటి వైద్యశాల వారిచే నిర్వహించిన ఉచిత మెగా కాటరాక్ట్(కంటి శుక్ల) శస్త్ర చికిత్స వైద్య శిబిరం శనివారం ముగిసింది. 9రోజుల పాటు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 960మందికి శంకర నేత్రాలయం వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించగా 86 మందికి కంటి శుక్లాం ఉన్నట్టు గుర్తించి ఉచితంగా శాస్త్ర చికిత్సలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసిబి వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ శంకర కంటి వైద్యశాల వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. మనిషి దేహంలో కళ్ళే అత్యంత ప్రధానమైనవని, కంటి సమస్యలు వస్తే ఆసుపత్రికి వెళ్లేందుకు నిర్లక్ష్యం చేస్తుంటారనే ఉద్దేశ్యంతో గ్రామ ప్రజలతోపాటు వివిధ గ్రామాల పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొడిగె సైదులు, కుంభం భాషయ్య, పానుగుళ్ల వెంకటేశం, జవాజి శేఖర్, బత్తుల వెంకటేశం, ఆప్తమాలజిస్ట్ తమిళ్, గోపీనాథ్, మురళి, భరత్, సిబ్బంది మోసస్, రంజిత్ కుమార్, శివ, ప్రశాంత్, బాలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నించే గొంతు పార్లమెంట్ లో ఉండాలి

**చౌటుప్పల్, విశాలభారతి**: భువనగిరి పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రజలకు నష్టం చేస్తున్న నరేంద్రమోడి పదేళ్ల పాలనలో దేశం పూర్తిగా పతనమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు చాలా ప్రాధాన్యమైనవని తెలిపారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తు, ప్రజలందరి భవిష్యత్తు అన్నారు. ప్రశ్నించే గొంతు పార్లమెంట్ లో ఉండాలన్నారు. దేశంలో పదేళ్ల నరేంద్ర మోడి పాలనలో బీజేపీ దుర్మార్గమైన విధానాలను అవలంభించిందన్నారు. పేద ప్రజలకు నష్టం కలిగించే విధంగా పరిపాలన కొనసాగించిందని విమర్శించారు. పదేళ్ల బీజేపీ పాలనలో 60వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయడంలో మోడి విఫలం చెందారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్న మోడి ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే విధంగా ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టారన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించారని తెలిపారు. ధరల మీద ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందన్నారు. జీఎస్టీ తీసుకుచ్చి లక్షల కోట్ల పన్ను ప్రజలతో కట్టించి, తీవ్రంగా నష్టపర్చుతున్నారని విమర్శించారు. 60 సంవత్సరాల కాలంలో ఏ ప్రధానమంత్రి చేయని అప్పులను పదేళ్లలో మోడి 55 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయితగోని విజయ్‌కుమార్, సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్.డి. పాషా, బూర్గు కృష్ణారెడ్డి, మండలకార్యదర్శి దోడ యాదిరెడ్డి పాల్గొన్నారు.

## గీతం స్కాలర్ గొల్లపల్లి శంకర్ కు పీహెచ్ డీ

**పటాన్‌చెరు,విశాలభారతి:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, హైదరాబాద్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి గొల్లపల్లి శంకర్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'తాత్కాలిక మాగ్నెటో హైడ్రోడైనమిక్స్ (ఎంహెచ్ డీ) ఎండిన ద్రవ ప్రవాహం సమస్యలు: పరిమిత మూలకం పద్ధతి (ఎఫ్ఈఎం)'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి శేరి శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఐఐటీ ఖరగ్ పూర్లోని గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి దీనికి బాహ్య పరిశీలకుడిగా వ్యవహరించినట్టు తెలిపారు. గొల్లపల్లి శంకర్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇంచార్జి ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు పేర్కొన్నారు.

## పెట్రోల్ బంక్ లో సాంకేతిక సమస్య

**దేవరుప్పుల, విశాలభారతి:** సింగరాజుపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో పెట్రోల్ రాకముందే అమౌంట్ రీడింగ్ చూపిస్తుందని 12 4 24 రోజున వినియోగదారులు ఆరోపించారు .ఈ విషయంపై ఈ రోజు లీగల్ పెట్రోల్టీ (డిఎల్ ఎన్ఓ) మరియు డిప్యూటీ తహసిల్దార్ (పౌ.స) దేవర్పుల మండలం సింగరాజు పల్లి గ్రామంలోని జై జవాన్ జై కిసాన్ (ఐఓసీఎల్) పెట్రోల్ పంపులు మీటర్ రన్నింగ్ పెట్రోల్ రాలేదన్న విషయంపై ఈరోజు తనిఖీలు నిర్వహించారు. ఇట్టి తనిఖీలు, అండర్ గ్రౌండ్ ట్యాంక్ మోటర్ పైప్ లైన్ లో సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ తప్పుగా అవుతుందని గుర్తించారు. ఇట్టి విషయము ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోనందుకు మరియు పంపు నడిపినందున యజమానిపై లీగల్ మెట్రోలజీ చట్టం ఉల్లంఘించి నందున కేసు నమోదు చేసి మరమ్మతులు చేసే వరకు పెంపును నిలిపివేశారు.





## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపిటిసి కిరణ్ జ్యోతి

**విశాలభారతి,కీసర:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రేడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా గోధుమకుంట ఎంపిటిసి కిరణ్ జ్యోతి ప్రవీణ్ కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రేడ్డికి పుష్ప గుచ్చం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సంధర్భంగా ఎంపిటిసి కిరణ్ జ్యోతి మాట్లాడుతూ పోయిన ఎన్నికల్లో మల్కాజ్ గిరి ఎంపి గెలుపులో తను పడ్డ కష్టాన్ని ఎప్పటికి మరిచిపోలేనని సిఎం గుర్తుచేశారని అన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పారని అన్నారు. ఈ సంధర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిరణ్ జ్యోతి ప్రవీణ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



## మురుగు సమస్య పరిష్కరించండి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ 24వ వార్డులో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డికి మిథాని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మీథాని కాలనీ పైన ఉన్న 13 వార్డు నుంచి వచ్చిన మురుగు చేరి కాలనీవాసులు చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఓపెన్ నాలా ఉండడంతో చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. మురుగు సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

## వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**ఎల్బీనగర్ విశాల భారతి:**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ సౌత్ కాలనీ శ్రీశ్రీశ్రీ భూలక్ష్మి దేవి శ్రీ గణపతి స్వామి శ్రీ వేణుగోపాల స్వామి వార్ల ఆలయ ఐదవ వార్షిక బ్రహ్మోత్సవాలలో డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆ భగవంతుని దివ్య ఆశీస్సులను పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్

ఆదివారం,
14.04.2023
హైదరాబాద్



## కంటోన్మెంట్ నియోజకవర్గం సాయన్న కుటుంబం

■ రావుల శ్రీధర్.

**కంటోన్మెంట్,విశాలభారతి:**నిస్వార్థంగా ప్రజా సేవ చేసి, బ్రతికున్నంత కాలం కంటోన్మెంట్ నియోజిక వర్గ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నేత దివంగత నేత సాయన్న అని ఎన్నికల ఇన్చార్జీ రావులు శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కంటోన్మెంట్ నియోజిక వర్గం,8వ వార్డులో మాజీ బోర్డు మెంబర్ లోకనాథం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ఎన్నికల ఇంఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ప్రజా సేవకు అంకితమైన కుటుంబానికి మాజీ సీఎం కేసీఆర్ అవకాశం కల్పించడం హర్షించతగిన విషయం అన్నారు. తండ్రి సాయన్న రాజకీ వారసత్వాన్ని కొనసాగిస్తూ అదే సేవాగుణంతో ప్రజల ముందుకు వస్తున్న నివేధితను గెలిపించాల్సిన అవసరం ఉందని శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీలు మారిన నేతలకు ఉపఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలకు సూచించారు. ఊసరవెల్లిలా రంగులు మార్చడం వారి నైజమని దుమ్మెత్తారు. అటువంటి నేతల పట్ల ప్రజలు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరో వైపు బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు కేసీఆర్ చేసిన సేవలను వివరించాల్సిన బాధ్యత స్థానిక నేతల పై ఉందని గుర్తు చేశారు.మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎన్నికల భరిలో నిలిచిన నివేధత సాయన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు మెంబర్లు జక్కుల మహేశ్వర్ రెడ్డి, లోక నాధన్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

■ ప్రతిపక్షాల డిపాజిట్లు గల్లంతు అవుతాయి
■ సోమవారం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం
■ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తొర్రురులోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో రంగారెడ్డి విలేకరులతో మాట్లాడారు. యువకుడు, ఉత్సహవంతుడు అయిన కిరణ్ కుమార్ రెడ్డి విజయం నల్లేరుపై నడకేనని అన్నారు. బీ ఆర్ ఎస్, బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కే అవకాశం లేదన్నారు. కిరణ్ కుమార్ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ, బూతు స్థాయిలో ప్రతి ఒక్కరు కృతనిశ్చయంతో పనిచేయాలని రంగారెడ్డి సూచించారు. బూతు ఇంచార్జుల లిస్టును అందిచాలన్నారు. అలాగే సోమవారం తుర్కయంజాల్ మన్నెగూడలోని శార్థ కన్వెన్షన్ హల్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సహా ముఖ్య నాయకులు హాజరు అవుతున్నట్టు తెలిపారు. ఈ సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతి బూతు నుంచి 50మందికి మించి కార్యకర్తలు తరలి వచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తల పనితీరును బట్టి అవకాశాలు ఇస్తామన్నారు. జూన్ లో పంచాయతీ, స్థానిక ఎన్నికలు రానున్నాయని, కష్టపడే నాయకులకు తప్పనిసరిగా గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, కుంట గోపాల్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి (జానీ), కాకుమాను సునీల్, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, నారని శేఖర్ గౌడ్, తాటిచెట్టు అశోక్ గౌడ్, గుండా ధనరాజ్, కొల్లూరు నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కంటోన్మెంట్ లో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం..

■ ఇంటింట ప్రచారం చేసి ఓట్లు అడిగిన
■ సునీతమహేందర్ రెడ్డి,శ్రీగణేష్

**విశాలభారతి,కంటోన్మెంట్** కంటోన్మెంట్ నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి సునితామహేందర్,ఉప ఎన్నికల భరిలో నిలిచిన శ్రీగణేష్ ఇరువురు కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సునిత మహేందర్ రెడ్డి, శ్రీ గణేశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. నియోజికవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వివరించారు.ఒక వైపు ఇంటింట ప్రచారం చేశారు,మరోవైపు కొన్ని ప్రాంతాల్లో రోడ్ షో ను నిర్వహించారు. కంటోన్మెంట్ నియోజికవర్గంలో గాంధీనగర్, కాకాగుడా, లక్ష్మీ నగర్, సాకలిబస్తీ, లాల్ బజార్, శాస్త్రి నగర్, చిన్న కమెల, పెద్దమ్మ టెంపుల్, రసూల్ పుర, ఇందిరమ్మ నగర్, రీసాల బజార్, చింతల్ బస్తి, వడ్డెర బస్తి, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు..ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కాంగ్రెస్లో చేరిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ దంపతులు

**ఎల్బీనగర్ విశాలభారతి:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జూబ్లీ హిల్ల్ స్లోని సీఎం నివాసం నందు జరిగిన కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ , బీఆర్ఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న, రామ్మోహన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, మాజీ జీహెచ్ఎంసీ కోఆప్షన్ సభ్యురాలు మల్లారపు షాలిని తదితరులున్నారు. వారితోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కత్తుల రాంబాబు, జోగు రాములు, ముద్దగౌని రంజిత్ గౌడ్, ముద్దగౌని మనీష్ గౌడ్, వెంకట కృష్ణ, నగేష్ గౌడ్, శంకర్, ఉషారాణి, చరణ్, సాయి తదితరులున్నారు.





# నాలుగు నెలల్లో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

■ 10 ఏళ్ళు బీజేపీ చేసిందేమీ లేదు
■ పనిమంతుడు వెంకట్రామరెడ్డికి పట్టం కట్టాలి
■ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

**పటాన్ చెరు,విశాలభారతి:**నమ్మి ఓట్లేస్తే కాంగ్రెస్, బీజేపీలు నట్టేట ముంచాయని మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు.. పటాన్ చెరులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డితో కలిసి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు ప్రాంతంలో గతంలో తాగునీటి గోస ఉండేదని, మిషన్ భగీరథ ద్వారా గోస తీర్చడం జరిగిందన్నారు.1.42 కోట్ల మంది మహిళలకు మహాలక్ష్మి పథకంలో నెలకు 2500 ఇస్తామని మోసం చేశారని, ఓట్లకు వస్తే అడుగడుగునా నిలదీయాలన్నారు.
రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు, అన్ని వర్గాలు వారికి మోసం చేశారన్నారు..రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మాటను కూడా అపహాస్యం చేశారన్నారు..4వేల పించన్ ఇస్తామని 44 లక్షల మందికి దోఖా చేశారని ఆరోపించారు. డిసెంబర్ 9 తర్వాత 2 లక్షల ఋణమాఫీ చేస్తామని, రైతు భరోసా ద్వారా 15000, కూలీలకు 12000 ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. విదేశాల్లో నల్లధనం తీసుకువొచ్చి పేదలకు పంచుతామని బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అబద్దాలు, మోసం మాటలు మాట్లాడిన రఘునందన్ కు దుబ్బాకలో బుద్ది చెప్పారన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్ లో ఎలా చెల్లుతుందన్నారు. వెంకట్రామరెడ్డిని నాన్ లోకల్ అంటున్న రఘునందన్ రావు గతంలో పటాన్ చెరులో జడ్పీటిసిగా పోటీ చేయలేదా అని ప్రశ్నించారు.. తెల్లాపూర్ లో నివాసం ఉంటున్న లోకల్ ఎంపీ అభ్యర్థి పి. వెంకట్రామరెడ్డికి ఘన విజయం అందించాలన్నారు.

### పటాన్ చెరు నుండి లక్ష మెజారిటీ అందిస్తాం..

విద్యావంతుడుగా, జిల్లా కలెక్టరుగా పేరు గాంచిన మెదక్ ఎంపీ అభ్యర్థి పి. వెంకట్రామరెడ్డికి లక్ష ఓట్ల మెజారిటీ అందిస్తామన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాతే అభివృద్ధి, సంక్షేమం జోరందుకుందన్నారు. నాడు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావుల సహకారంతో 9 ఏళ్లలో 9 వేల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. స్వంత నిధులతో 150 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మొన్న ఎన్నికల్లో భారీ మెజారిటీ వస్తుంది అని ఆశించాము కానీ తక్కువ మెజారిటీ వచ్చిందని నిరాశ చెందవద్దన్నారు..ఎంపీ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీ అందిస్తామన్నారు.

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

### నేను లోకల్.. ఆశీర్వదించి గెలిపించండి

నెల రోజులు నాకోసం పనిచేస్తే..5 ఏళ్ళు మీవెంట ఉంటా .ఒక్క నెలరోజులు నా వెంట ఉండాలని, 5 ఏళ్ళు మీ వెంట పనిచేస్తానని మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ పి. వెంకట్రామరెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా సేవ చేయాలనే రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు.. ట్రస్టు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె. సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

**- మెదక్ ఎంపీ అభ్యర్థి పి. వెంకట్రామరెడ్డి**



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ని ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డితో కలిసి 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## మందకృష్ణ మాదిగ అంబేద్కర్ వ్యతిరేకి

■ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్



**సికింద్రాబాద్,విశాలభారతి:**డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక అసమానతల పునాదిగా ముఖ్యంగా కుల వివక్షతను ఎదుర్కొంటున్న ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనార్టీల కోసం రిజర్వేషన్లు కల్పించారు. నేడు అందుకు విరుద్ధంగా అగ్రవర్ణ పేదలు దేశంలో కేవలము 5 శాతం ఉండగా ఎలాంటి కమిషన్ వేయకుండా 10 శాతం రిజర్వేషన్ కల్పించి బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తి కి వ్యతిరేకంగా ఆర్థిక ప్రాతిపదికన కల్పించిన అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లను సమర్థిస్తున్న మందకృష్ణ మాదిగ అంబేద్కర్ వ్యతిరేకి అని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ విమర్శించారు. శనివారం తార్నాక లో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బిజెపిని దళిత క్రైస్తవ ఉండి ఎలా సమర్థిస్తావని మందకృష్ణ ప్రశ్నించారు అంతేకాకుండా అగ్రవర్ణాలు బీసీలు చివరికి ఎస్టీలు క్రైస్తవ మతం మారితే రద్దు గాని రిజర్వేషన్లు కేవలం దళితులు మాత్రమే క్రైస్తవులు అయితే రిజర్వేషన్లు రద్దు చేస్తామని బిజెపి ప్రకటించడం భారత రాజ్యాంగం అధికరణ 25 , 26 ద్వారా బోధిస్తున్న మత స్వేచ్ఛకు విరుద్ధమని భారత రాజ్యాంగాన్ని మార్చాలని బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రజలందరికి సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం దక్కాలని ఆశిస్తే అందుకు పూర్తి విరుద్ధంగా మనుధర్మాన్ని బహుజనులను శాశ్వతంగా శాశ్వతంగా బానిసలుగా మార్చే సిద్ధాంతా భూమిక కలిగిన బిజెపిని మంద కృష్ణ మాదిగ సమర్థించడమంటే ఆయన అంబేద్కర్ ఆశించిన సమ సమాజ స్థాపనకు వ్యతిరేకి అని వినోద్ కుమార్ విమర్శించారు.




## జాతీయ అగ్నిమాపక దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

■ అగ్నిప్రమాదలు జరగకుండా జాగ్రత్త వహించడం

**సికింద్రాబాద్, విశాలభారతి:** నేషనల్ ఫైర్ సర్వీస్ వీక్ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1420 వరకు నిర్వహించడం జరుగుతుందని అగ్నిమాపక అధికారులు చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది త్యాగాలను, విజయాలను, ధైర్యసాహసాలను గుర్తించడం మరియు అగ్నిమాపక శాఖ ద్వారా అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగించి, తద్వారా అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించడం జాతీయ అగ్నిమాపక దినోత్సవం (National Fire Service Day) ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.అగ్నిమాపక వార్షికోత్సవంలో భాగంగా ప్రమాదము సంభవించకుండా మరియు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్స్ మరియు కరపత్రములను శనివారం వీసీ ప్రో. రవీందర్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఓయు పరిధిలో గల అన్ని విద్యాసంస్థలను మరియు విద్యార్థులను భాగస్వాములు చేసి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది యొక్క సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి మధుసూదన్ రావు, ADFO సురేష్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, SFO కె. రామకృష్ణ రెడ్డి మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



## షాబాద్ వైస్ ఎంపీపీ భౌతికకాయానికి నివాళులు అర్పించిన రంజిత్ రెడ్డి

**విశాలభారతి,షాబాద్:** షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మండల వైస్ ఎంపీపీ మంగలి శివ కుమార్ శనివారం ఉదయం మరణించాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇంఛార్జి పామేన భీం భరత్ శివ కుమార్ నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ శివ కుమార్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. వీరితో పాటు షాబాద్ ఎంపీటీసీ గుండాల అశోక్, కాంగ్రెస్ నాయకుడు దండు రాహుల్ తదితరులు వున్నారు.







## నియోజకవర్గంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి

**పాలకుర్తి ,విశాల భారతి:**

కొడకండ్ల మండలం రామవరం గ్రామంలో శ్రీ రామచంద్ర స్వామి వారి ప్రతిష్ట మహోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన స్థానిక శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని ఝాన్సి రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు వేదపండితులు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ నాయక్, సీనియర్ నాయకులు వెంగల్ రావు, మోహన్, పార్టీ ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, గ్రామ పార్టీ ముఖ్యనాయకులు, తదితరులు, ఉన్నారు. రాయపర్తి మండలం మైలారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు భీమా రెడ్డి నూతన గృహప్రవేశం వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. ఈ కార్యక్రమంలో, పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి,బ్లాక్ అధ్యక్షుడు హమ్యా ,నర్సయ్య, తొర్రురు మండల అధ్యక్షులు సంతోష్, బాబు, గ్రామ ముఖ్యనాయకులు, తదితరులు,పాల్గొన్నారు. దేవురుప్పల మండల కేంద్రంలో శ్రీ ప్రశాంతి విద్యా నికేతన్ స్కూల ్పాండు కృష్ణ ఆహ్వానం మేరకు స్కూల్ 17వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు చదువుపై శ్రద్ద చూపాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నల్ల శ్రీరామ్, పార్టీ ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, తల్లిదండ్రులు, తదితరులు, పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

09

ఆదివారం,
14.04.2023
హైదరాబాద్

vishalabharathi Telugu Daily

## మెగా రేసులో బన్నీ టాప్ గేర్!



మెగాస్టార్ స్టార్ చిరంజీవి ఇమేజ్ తో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి ఇండస్ట్రీని రూల్ చేస్తోన్న నటులు అంటే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, రామ్ చరణ్ కనిపిస్తారు. వీరి తర్వాత సాయి తేజ్, వరుణ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్ ఉన్నారు. మిగిలిన నలుగురు టైర్ 2 హీరోలుగానే ఫైట్ చేస్తున్నారు. మెగాస్టార్ తర్వాత స్టార్ హీరోలుగా ప్రస్తుతం మార్కెట్ లో పవన్, చరణ్, బన్నీ వారికంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని అందుకున్నారు. 1అయితే వీరందరిలో మార్కెట్ పరంగా ఎవరిది ఆధిపత్యం అంటే ప్రస్తుతం వినిపించే మాట అల్లు అర్జున్ అని. పుష్ప సినిమాతో టాలీవుడ్ లో ఎవరికి సాధ్యం కానీ నేషనల్ అవార్డుని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సొంతం చేసుకున్నారు. చిరంజీవి వందల చిత్రాలు చేసిన ఇప్పటి వరకు నేషనల్ అవార్డు అందుకోలేకపోయారు. పుష్ప మూవీ బన్నీ ఇమేజ్ ని అమాంతం పెంచేసింది. దీంతో ప్రస్తుతం చేస్తోన్న పుష్ప ది రూల్ మూవీపైన భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. నెక్స్ట్ రామ్ చరణ్ ఆర్ఆర్ఆర్ మూవీతో గ్లోబల్ స్టార్ ఇమేజ్ అందుకున్నాడు. అయితే ఆ సినిమా క్రెడిట్ మొత్తం రాజమౌళికి వెళ్ళిపోయింది. ఇప్పుడు చరణ్ గేమ్ చేంజర్ తో సోలోగా ప్రూవ్ చేసుకుంటున్నారు. ఈ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో కమర్షియల్ సక్సెస్ అందుకుంటే ఆయన మార్కెట్ వేల్యూ కచ్చితంగా పెరుగుతుందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు.పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఓజీ, హరిహర వీరమల్లు సినిమాలు పాన్ ఇండియా రేంజ్ లో భారీ బడ్జెట్ తో చేస్తున్నారు. కమర్షియల్ హీరోగా అత్యధిక ఫ్యాన్ బేస్ ఉన్న కూడా పవన్ కళ్యాణ్ ఇటు సినిమా, అటు రాజకీయాలు చేస్తూ ఉండటంతో పాన్ ఇండియా ఇమేజ్ ని అందుకోలేకపోయారు. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర మూవీతో తన స్టామినా చూపించుకునే పనిలో ఉన్నారు. అయితే మార్కెట్, బ్రాండ్ ఇమేజ్, బిజినెస్, రికార్డ్స్, నాన్ థీయాట్రికల్ రైట్స్ పరంగా మెగా హీరోలలో బన్నీనే టాప్ చైర్ లో ఉన్నాడని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఐకాన్ స్టార్ ఇమేజ్ హైలెవల్ కి వెళ్ళడానికి కారణం పుష్ప మూవీ అని చెప్పాలి. పుష్ప ది రూల్ తో బ్లాక్ బస్టర్ కొట్టి 1000కోట్ల క్లబ్ లో చేరితే ఇమేజ్ పరంగా అతన్ని మ్యాచ్ చేయలేరనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇక పుష్ప 2 సినిమా ను మైత్రి మూవీ మేకర్స్ దాదాపు 300 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కాబోతోంది. ఈ సినిమాతో ఎలాగైనా సాలిడ్ సక్సెస్ అందుకోవాలని బన్నీ హార్డ్ వర్క్ చేస్తున్నాడు. మరి సినిమా ఏ స్థాయిలో క్లిక్కవుతుందో చూడాలి.

## డాక్టరేట్ అందుకున్న రామ్ చరణ్..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పేరు తెలియని వాళ్లు.. ఈ దేశవ్యాప్తంగా లేరంటే అతిశయోక్తి కాదు. అద్భుతమైన టాలెంట్ కల్గిన ఈయన అదిరిపోయే సినిమాలు చేస్తూ అందరినీ మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తెలుగు సినీ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేస్తున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్ గా మారాన ఈ మెగా పవర్ స్టార్.. తాజాగా ఓ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఓ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఆ విశేషాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.2007లో చిరుత సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. తొలి చిత్రమే సూపర్ డూపర్ హిట్ కావడంతో.. ఆతర్వాత కూడా వరుసగా అవకాశాలు అందిపుచ్చుకున్నాడు. అలా అదిరోపోయే చిత్రాలు చేస్తూ తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంటున్నాడు. ప్రస్తుతం 39 ఏళ్ల వయసు కల్గిన ఈయన మొత్తం 15 సినిమాలు చేశాడు. చేసినవి తక్కు చిత్రాలే అయినా ఇందులో బ్లాక్ బస్టర్ హిట్ లు ఎక్కువగా ఉండడంతో.. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా ఆర్ఆర్ఆర్ సినిమాతో ఈయన క్రేజ్ మరింతగా పెరిగిపోయింది.ఈ ఒక్క చిత్రం వల్లే అనేక అవార్డులు అందుకున్న రామ్ చరణ్.. ఇప్పుడో మరో గౌరవాన్ని కూడా దక్కించుకున్నాడు. రాజమౌళి డైరెక్షన్ లో వచ్చిన ఈ సినిమాలోని నాటు నాటు సాంగ్ కు అయితే ఆస్కార్ అవార్డు వచ్చింది. ఇలా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఈ సినిమాలో నటించి ప్రతీ ఒక్కరికీ మంచి గుర్తింపే వచ్చింది. అయితే తాజాగా మరో సారి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. చెన్నైకు చెందిన వేల్స్ యూనివర్సిటీ చెర్రీకి డాక్టరేట్ ప్రకటించింది. ఏప్రిల్ 13వ తేదీ అంటే ఈరోజే రామ్ చరణ్ కు డాక్టరేట్ ను ప్రదానం చేశారు. చెన్నైలోని వేల్స్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా వెళ్లిన ఈయనే అక్కడ అవార్డు అందుకున్నారు. అయితే మ్ చరణ్ తెలుగు సినీ రంగానికి అందిస్తున్న సేవలకు గానే ఈ డాక్టరేట్ ను వేల్స్ యూనివర్సిటీ అందరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చెర్రీ డాక్టరేట్ అందుకున్న వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియో, ఫొటోలు చూసిన ప్రతీ ఒక్కరూ అభినందనలు తెలుపుతున్నారు. తెలుగు సినీ రంగ ఖ్యాతిని ఖండాంతరాలు దాటిస్తున్న మీరు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు, గౌరవాలు అందుకుంటారని కామెంట్లు చేస్తున్నారు.



## ఆడబిడ్డకు జన్మనిచ్చిన మంచు మనోజ్ దంపతులు

మంచు మనోజ్ కుమార్ మౌనిక భూమాను వివాహం చేసుకున్నారు. ఇటివలే ఈ జంట బిడ్డకు జన్మనివ్వబోతున్నట్లు ప్రకటించారు. మనోజ్ కుమార్, మౌనికలకు పండంటి ఆడబిడ్డ పుట్టిందని మనోజ్ సోదరి లక్ష్మి మంచు ట్విట్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అధికారికంగా ప్రకటించారు. ''దేవతలచే ఆశీర్వదించబడిన ఒక చిన్ని దేవత వచ్చింది! మనోజ్ కుమార్, మౌనిక ఎంతోగానో ఎదురుచూస్తున్న తమ ఆడబిడ్డను స్వాగతించారని ప్రకటించడం మాకు చాలా ఆనందంగా ఉంది. పెద్ద సోదరుడిగా ధైరవ్ చాలా సంతోషించాడు. మేము ఆమెను ప్రేమతో 'ఎంఎం పులి' అని పిలుస్తాము'' అని లక్ష్మి మంచు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సినిమాల విషయాని వస్తే.. మనోజ్ కుమార్ మళ్లీ యాక్షన్ లోకి దిగారు. ప్రీప్రొడక్షన్ దశలో పలు ప్రాజెక్ట్‌లను వున్నాయి. అనౌన్స్ చేసిన ఒక క్రేజీ యాక్షన్ చిత్రం ఇప్పటికే పూర్తి స్వింగ్‌లో షూటింగ్ ప్రారంభమైయింది. ఈ హైఆక్టేన్ యాక్షన్ చిత్రం గ్లింప్స్ మనోజ్ కుమార్ మంచు బర్త్ డే మే 20 న విడుదల చేయడానికి సన్నహాలు జరుగుతున్నాయి.



## 25న హాట్ స్టార్ లో గోపీచంద్ భీమా

గోపీచంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్ టైనర్ భీమా ఓటీటీ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ సినిమా ఈ నెల 25వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కు రాబోతోంది. తాజాగా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఈ అనౌన్స్ మెంట్ చేసింది. మాస్ యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారు భీమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ పై ఇంట్రెస్ట్ గా ఉన్నారు. ఈ సినిమాను శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ లో నిర్మాత కెకె రాధా మోహన్ నిర్మించారు. దర్శకుడు ఎ హర్ష రూపొందించారు. భీమా చిత్రంలో ప్రియ భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్స్ గా నటించారు. పవర్ ఫుల్ పోలీస్ కథతో తెరకెక్కిన భీమా సినిమా గత నెల 8వ తేదీన థియేటర్స్ లోకి వచ్చింది. మాస్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది భీమా. ముఖ్యంగా బి, సి సెంటర్స్ ఆడియెన్స్ ఈ సినిమాను బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇప్పుడు డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లోనూ భీమా సినిమాకు మంచి రెస్పాన్స్ రాబోతోంది.

## అంగరంగ వైభవంగా మేకప్ మ్యాన్ ప్రారంభోత్సవం



అభిరామ్ మూవీస్ బ్యానర్ పై సీనియర్ మేకప్ మ్యాన్ కుమార్ మెట్టుపల్లి నిర్మాతగా, దివాకర్ యడ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం మ్యాకప్ మ్యాన్. దివంగత ప్రముఖ నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం గారి మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. పోలూరు ఘటికచలం డైలాగ్స్, ఎం ఎం శ్రీలేఖ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం హైదరాబాద్ లోని ఫిల్మ్ ఛాంబర్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు రవి కుమార్ చౌదరి, నిర్మాతలు లయన్ సాయి వెంకట్, భరత్ పారేపల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టారు. లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, భరత్ పారేపల్లి తొలి షాట్ కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకులు రవి కుమార్ చౌదరి మాట్లాడుతూ.."నేను దర్శకుడిగా పరిచయం అయినప్పుడు మా గురువు సాగర్ గారు ఎంత హ్యాపీగా ఫీల్ అయ్యారో, ఇప్పుడు కూడా నేను అంతే ఆనందం గా ఉన్నాను. నా దగ్గర అసిస్టెంట్ గా వర్క్ చేసిన దివాకర్ మంచి స్టోరీ టెల్లర్. చాలా ప్యాషన్ తో పని చేస్తాడు. ఈ కథను చాలా అద్భుతంగా రాశాడు. తనతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ఈ చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నా" అని అన్నారు. లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ.."ప్రతి చిత్రానికి మేకప్ మ్యాన్ పాత్ర చాలా కీలకం గా ఉంటుంది. అలాంటి మేకప్ మ్యాన్ ప్రాముఖ్యతను ఈ చిత్రంలో చూపించడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని భగవంతుని ప్రార్థిస్తున్నా" అని అన్నారు. చిత్ర దర్శకుడు దివాకర్ యడ్ల మాట్లాడుతూ.." చిత్ర పరిశ్రమలో మేకప్ మ్యాన్ ప్రాముఖ్యత చాలా కీలకంగా ఉంటుంది. అలాంటి మేకప్ మ్యాన్ ల జీవితాలను ఇందులో చూపిస్తాము. వాళ్ళ లైఫ్ స్టైల్, వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలను ఇందులో చూపించబోతున్నాం. త్వరలో షూటింగ్ మొదలు పెడుతున్నాం" అని చెప్పారు.



## వారికి థాంక్స్ చెప్పాలి!

కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఎన్నో తిరస్కారాలు తనలో పట్టుదలను పెంచాయని, వాటన్నింటినీ ఛాలెంజ్‌గా తీసుకొని పనిచేయడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పింది కథానాయిక మృణాల్ ఠాకూర్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ భామ ఇండస్ట్రీలో తన తొలినాటి రోజుల్ని గుర్తుచేసుకుంది. 'ఆడిషన్స్‌కు వెళ్లిన చాలా సందర్భాల్లో నేను నటనకు పనికిరానని చెప్పేవారు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. ఎలాగైనా సరే సినీ రంగంలో రాణించాలనుకున్నా. ప్రతి రోజు కొత్త విషయాలను తెలుసుకుంటూ నా నటనను మెరుగుపరచుకున్నా. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఈ స్థాయికి వచ్చాను. నన్ను తిరస్కరించిన వారికి కృతజ్ఞతలు చెప్పాలి. వారి వల్లే మరింత పట్టుదలతో కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నా' అని మృణాల్ ఠాకూర్ చెప్పింది. పాత్రలో పరకాయ ప్రవేశం చేసినప్పుడు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటామని, 'సీతారామం' చిత్రంలో సీతామహాలక్ష్మి పాత్రను ప్రాణం పెట్టి చేశానని, అందుకే ఆ క్యారెక్టర్ ఇప్పటికీ గుర్తుండిపోయిందని ఈ భామ చెప్పకొచ్చింది. ఆమె విజయ్ దేవరకొండ సరసన నటించిన తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది.

## ఘనంగా 'శర పంజరం' ప్రీ రిలీజ్



గంగిరెద్దుల అబ్బాయి, జోగిని అమ్మాయి ప్రేమలో పడితే ఎం జరిగింది. ఆఊరి దొర మరియు గ్రామ ప్రజలు వీరిపై ఎలాంటి వ్యతిరేకత కనపరచారు అనే పల్లెటూరు నేపథ్యంలో సాగే కథాంశంతో వస్తున్న జీరో బడ్జెట్ చిత్రమే 'శరపంజరం'. దోస్తాన్ ఫిలింస్, అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై టి. గణపతిరెడ్డి సహకారంతో, మామిడి హరికృష్ణ ఆశీస్సులతో నవీన్‌కుమార్ గట్టు, లయ జంటగా, నవీన్‌కుమార్ గట్టు దర్శకత్వంలో తెరకెక్కించారు. ఏప్రిల్ 19న ఈ చిత్రం భారీ ఎత్తున విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఈ చిత్రం ట్రైలర్ విడుదల, ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇది మట్టి మనుషుల కథ. మన సమాజంలో అత్యంత దుర్మార్గమైన జోగిని వ్యవస్థ, చావులకు గంగిరెద్దులను ఆడిరచే సంచార జాతుల వెతలు నేపథ్యంగా తీసిన ఇలాంటి చిత్రాలు కోట్లాది మందికి చేరతాయి. తద్వారా సమాజంలో మార్పు వస్తుంది. మట్టి మనుషుల జీవితాలను తీసుకుని, తొలి సినిమానే సామాజిక చైతన్యం కోసం పాటుపడే చిత్రాన్ని ఎంచుకున్న దర్శకుడు నవీన్ గట్టుకు నా అభినందనలు. అలాగే గణపతిరెడ్డి గారికి, ఈ సినిమా నిర్మాణంలో సహకరించిన అందరికీ నా శుభాకాంక్షలు అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.